


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 21, పేజీలు - 08

గురువారం, జులై 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## రండి.. చట్టాన్ని ఎదుర్కోండి

### - షేక్ హసీనా రాకపై బంగ్లాదేశ్ సర్కార్ స్పందన



ఢాకా (ప్రశ్న న్యూస్) బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మళ్లీ స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలపై అక్కడి ప్రస్తుత ప్రభుత్వం అత్యంత దూకుడుగా స్పందించింది. ఆమె ఢాకాకు రావాలనుకోవడాన్ని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని పేర్కొంటూనే.. దేశద్రోహం, మానవ హక్కుల ఉల్లంఘన కేసుల్లో

2లో..

## వేలంలో రికార్డు ధర పలికిన డైనోసార్ అస్థిపంజరం

### - సుమారు రూ. 482 కోట్లకు అమ్ముడైన 'గస్'




న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) వేలంలో ఓ డైనోసార్ అస్థిపంజరం సరికొత్త చరిత్ర సృష్టించింది. 'గస్' అనే ముద్దుపేరున్న టైరనోసారస్ రెక్స్ (టీ-రెక్స్) అస్థిపంజరం న్యూయార్క్‌లోని సోత్‌బేస్ వేలం కేంద్రంలో రికార్డు స్థాయిలో

2లో..

## చార్జింగ్‌లో పేలిన ఎలక్ట్రిక్ బైక్

### - ఐదు అంతస్తుల భవనం బుగ్గి, ఇద్దరు మృతి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నోయిడాలో బుధవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టార్ 66లోని మామురా గ్రామంలో ఉన్న ఒక బహుళ అంతస్తుల నివాస భవనంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు

2లో..

# మీ భవిష్యత్తుకు నాదీ హామీ

### పాఠశాల నూతన భవనం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

- ఆగస్టు 15లోపు ఎడ్యుకేషన్ కిట్ ఇస్తామన్న సీఎం
- గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్న రేవంత్ రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలపై ప్రత్యేకమైన దృష్టి పెట్టామన్న సీఎం
- విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం కారణంగానే విద్యార్థులు చేరలేదని, అధికశాతం మంది ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడులపై ప్రత్యేక దృష్టిసారించామని, ఉపాధ్యాయుల సిబ్బంది సమస్యలు పరిష్కరించామని సీఎం తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల హైస్కూల్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు.

2లో..



## రూ.2.19 లక్షల కోట్ల విలువైన 7 కీలక ప్రాజెక్టులు

### - కేంద్ర మంత్రివర్గం ఆమోదం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో తయారీ, మౌలిక వసతులు, వ్యవసాయం, రైల్వే రంగాలకు ఊతమిచ్చేలా కేంద్ర క్యాబినెట్ బుధవారం ఏడు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. మొత్తం రూ. 2,19,353 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపనున్నాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీ, రవాణా మౌలిక వసతులు, యూరియా ఉత్పత్తి, మొబైల్ తయారీ రంగాల్లో దీర్ఘకాలిక ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకుంది. బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

2లో..

## పరిశ్రమలకు అనుకూల వాతావరణం సృష్టిస్తాం

### - అమరరాజా యూనిట్ ప్రారంభించిన సీఎం రేవంత్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే శుభవార్త వినబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఒప్పించి అనుమతులు సాధించే దిశగా ముందుకు వెళుతున్నట్టు ప్రకటించారు. డిండి ప్రాజెక్టుకు సంబంధించి 30 టీఎంసీల నీటి కేటాయింపులపైన కూడా సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో స్థాపించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి

2లో..

## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్

- ఆర్థిక వృద్ధికి కేంద్రంగా అమరావతి నిర్మాణం
- సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన
- ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అంతర్జాతీయ స్థాయి నగరం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2లో..

## మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

### కృష్ణమ్మకు జల హారతి వేళ సీఎం చంద్రబాబు

- పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి
- రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరందిస్తామని స్పష్టీకరణ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



అమరావతి (ప్రశ్న న్యూస్)(రాష్ట్ర సాగునీటి రంగానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వచ్చే 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం పూర్తయితే గ్రావిటీ ద్వారానే నేరుగా నీరు అందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కృష్ణా-గోదావరి నదుల పవిత్ర సంగమ ప్రాంతమైన ఇబ్రహీంపట్నం

2లో..



## తెలంగాణలో ఓటర్లకు భారీ ఊరట

### ఎస్ఐఆర్ గడువు పొడిగింపు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును ఈనెల 24వ తేదీ నుంచి ఆగస్ట్ 3వ తేదీ వరకు పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయిలో సర్వే నెమ్మదిగా సాగుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే తాజా షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ఆగస్ట్ 3వ తేదీ వరకు ఇంటింటి సర్వే, ఓటరు వివరాల సేకరణ, ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను కొనసాగిస్తారు. ఆ తర్వాత ఆగస్ట్ 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత కొత్తగా ఓటు నమోదు,

2లో..

## ఏపీకి ప్రశంసలు.. రేవంత్ సర్కార్‌పై విమర్శలు

- ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కేంద్రమంత్రితో కేటీఆర్ భేటీ
- కేంద్ర, రాష్ట్రాలు చెరో రూ.250 కోట్లు ఇస్తే ప్లాంట్ ప్రారంభించవచ్చని ప్రతిపాదన
- ప్లాంట్ తెరిస్తే 6,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరణ
- కేటీఆర్ వినతిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కుమారస్వామి
- హామీ నెరవేర్చకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించిన కేటీఆర్



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని ఆదిలాబాద్‌లో గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని తక్షణమే పునరుద్ధరించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమైన ఆయన, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కేటీఆర్‌తో పాటు సీసీఐ సాధన సమితి ప్రతినిధులు, రైతులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగు రామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని కలిసింది. ఈ ప్లాంట్ పునరుద్ధరణ ద్వారా వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతం యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని కేటీఆర్ వివరించారు.దాదాపు 2,300 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంట్‌కు ఏటా 4 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, సుమారు 100 ఏళ్లకు సరిపడా సున్నపురాయి నిల్వలు అక్కడ ఉన్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తి నిరుపయోగంగా మారి తుప్పు పట్టకుండా కాపాడాలని ఆయన కోరారు. సుమారు రూ. 2,000 కోట్ల పెట్టుబడితో

2లో..

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

- ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు రేవంత్ శంకుస్థాపన
- తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలకు ఆహ్వానం
- మెట్రో విస్తరణ, ఈవీ బస్సులు, మూసీ ప్రక్షాళనకు ప్రాధాన్యం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని

2లో..




## తెలంగాణలో వింత వాతావరణం

2లో..

- జులై 22 వరకు పొడి వాతావరణం
- 5 జిల్లాల్లో వేడి, ఉక్కపోత.. ఐఎండీ హెచ్చరిక
- హైదరాబాద్‌లో 36 డిగ్రీల వరకు చేరనున్న గరిష్ఠ ఉష్ణోగ్రత



## పోక్సో చట్టం అమలుపై కీలక సూచనలు

### - సీఎం రేవంత్‌కు పవన్ కల్యాణ్ ఐదు పేజీల లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోక్సో చట్టం అమలును మరింత పటిష్టం చేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఒక కీలక లేఖ రాశారు. బాలల భద్రత, గౌరవం, భయం లేని జీవన హక్కు రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని ఆయన తన లేఖలో గుర్తు చేశారు. పోక్సో కేసులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. నేరస్తులు

2లో..

# రండి.. చట్టాన్ని ఎదుర్కోండి

మరణశిక్ష పడిన నేరస్థురాలిగా ఆమె చట్టాన్ని ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. 2024 ఆగస్టులో జరిగిన ప్రజా తిరుగుబాటుతో బంగ్లాదేశ్‌ను వదిలి పారిపోయిన షేక్ హసీనా... ప్రస్తుతం భారత్ లో తలదాచుకుంటున్నారు. అయితే, ఈ ఏడాది చివరినాటికి ఆమె స్వచ్ఛందంగా ఢాకాకు చేరుకుని, తన 'అవామీ లీగ్' పార్టీని మళ్లీ బతికించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.హసీనా రాకపై బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రెహమాన్ సలహాదారు జాహెద్ ఉర్ రెహమాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 నాటి విద్యార్థుల ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసి, వందల మంది ప్రాణాలు తీసిన నేరాలపై హసీనా కోర్టులో పోరాడాలని ఆయన అన్నారు. దేశ ప్రజలంతా ఆమెకు పడిన మరణశిక్ష అమలు కావాలని కోరుకుంటున్నారని, ఆమె వస్తే న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ లో జరిగే ఈ విచారణ అంతా పారదర్శకంగా ఉంటుందని, ప్రపంచ దేశాల పరిశీలకులు దీనిని గమనించవచ్చని చెప్పారు. ఒకవేళ కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తే దానికి కూడా తాము సిద్ధమేనని, హసీనా రాకపై ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు.గత ఏడాది నవంబర్‌లో ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్... విద్యార్థుల నిరసనల అణచివేత కేసులో హసీనాకు ఆమె లేని సమయంలోనే మరణశిక్ష విధించింది. అయితే ఈ కేసులన్నీ రాజకీయ కక్షసాధింపు చర్యలేనని హసీనా కొట్టిపారేస్తున్నారు. అప్పటినుంచి ఆమెను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ భారత్‌ను కోరుతోంది. హసీనా తాజా ప్రణాళికలపై భారత విదేశాంగ శాఖ అత్యంత జాగ్రత్తగా స్పందించింది. భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "ఈ విషయంలో మా విధానంలో ఎలాంటి మార్పు లేదు. నేరస్థుల అప్పగింత అనేది పూర్తిగా ఒక చట్టపరమైన ప్రక్రియ. దాని ప్రకారం ఏది జరగాల్సి ఉంటే అది చట్టబద్ధంగానే జరుగుతుంది" అని చెప్పారు.

# వేలంలో రికార్డు ధర పలికిన డైనోసార్ అస్థిపంజరం

50.1 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 482 కోట్లు) అమ్ముడుపోయింది. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన డైనోసార్ శిలాజంగా 'గస్' నిలిచింది. మంగళవారం జరిగిన ఈ వేలంలో, కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే ఏడుగురు పోటీదారుల మధ్య హోరాహోరీగా బిడ్డింగ్ సాగింది. ఈ అస్థిపంజరాన్ని 2021లో సౌత్ డకోటాలోని ఒక పశువుల క్షేత్రంలో కనుగొన్నారు. ఇందులో 183 శిలాజ ఎముకలు మాత్రమే లభ్యమయ్యాయి. ఇది డైనోసార్ దేహంలో సుమారు 63 శాతం మాత్రమే. దాదాపు 38 అడుగుల పొడవున్న ఈ డైనోసార్, సుమారు 6.6 నుంచి 7.2 కోట్ల సంవత్సరాల క్రితం జీవించిందని శాస్త్రవేత్తల అంచనా వేస్తున్నారు. 2024లో 44.6 మిలియన్ డాలర్లకు అమ్ముడైన 'అపెక్స్' అనే స్టెగోసారస్ అస్థిపంజరం పేరిట ఉన్న రికార్డును తాజాగా 'గస్' అధిగమించింది. అమెరికా చట్టాల ప్రకారం, ప్రైవేట్ భూముల్లో లభించిన శిలాజాలను ప్రైవేట్ ఆస్తిగానే పరిగణిస్తారు. అందుకే వాటిని వాణిజ్యపరంగా విక్రయించడం సాధ్యమవుతోంది. అయితే, ఈ విక్రయంపై పురాజీవ శాస్త్రవేత్తలలో మరోసారి చర్చ మొదలైంది. ఇలాంటి అరుదైన శిలాజాలు మ్యూజియంలకు కాకుండా ప్రైవేట్ వ్యక్తుల సేకరణలకు పరిమితమైతే, భవిష్యత్తులో శాస్త్రీయ పరిశోధనలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గుర్తుతెలియని వ్యక్తి కొనుగోలు చేసిన ఈ అస్థిపంజరాన్ని భవిష్యత్తులో ఎక్కడ ప్రదర్శిస్తారనే వివరాలను ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు.

# చార్జింగ్‌లో పేలిన ఎలక్ట్రిక్ బైక్

కోల్పోగా, సుమారు 50 కుటుంబాలను అధికారులు సురక్షితంగా వెలుపలికి తరలించారు. ఎలక్ట్రిక్ స్కూటర్‌కు చార్జింగ్ పెడుతుండగా ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగిసిపడటమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని అధికారులు నిర్ధారించారు. జి 4 భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్ ప్రదేశంలో ఈ మంటలు మొదలయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనం నుంచి వెలువడిన నిప్పురవ్వలు పక్కనే ఉన్న పెట్రోల్ వాహనాలకు వేగంగా వ్యాపించాయి. దీంతో దట్టమైన పొగ భవనం మొత్తాన్ని కమ్మేయడంతో పై అంతస్తుల్లోని నివాసితులు లోపలే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని, హైడ్రాలిక్ ప్లాట్‌ఫారమ్‌లు, పలు ఫైర్ టెండర్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలో చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. కాగా, పొగ పీల్చడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ భవనంలోని టూ-రూమ్ ఫ్లాట్‌లలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయని గౌతమ్ బుద్ధ నగర్ జాయింట్ పోలీస్ కమిషనర్ రాజీవ్ నారాయణ్ తెలిపారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు, భవన యజమానితో పాటు లీజుదారుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ దుర్ఘటనపై స్పందిస్తూ, సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

# మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

వద్ద బుధవారం జరిగిన ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సభలో కేఎల్ రావు కుమారుడు కేఎల్ విజయరావుతో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ సాగునీటి రంగానికి మహోన్నత సేవలు అందించిన కేఎల్ రావు స్ఫూర్తిని ప్రతీ గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. "విజయవాడ గడ్డపై పుట్టి, ఎంపీగా గెలిచి ముగ్గురు ప్రధానుల వద్ద కేంద్రమంత్రిగా పనిచేసిన ఘనత కేఎల్ రావుది. శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రతిష్టాత్మక డ్యామ్‌ల నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిది. ఐక్యరాజ్యసమితి తరపున అంతర్జాతీయ జల నిపుణుడిగా ఈజిప్ట్, సూడాన్ వంటి దేశాలకూ ఆయన సేవలందించారు. బ్రిటీష్ కాలంలో సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ, కృష్ణా బ్యారేజీలు నిర్మిస్తే స్వతంత్ర భారతంలో వాటిని ఆధునీకరించి తెలుగు నేలను సస్యశ్యామలం చేసింది కేఎల్ రావు గారే. వారి తర్వాత ఎన్టీఆర్ సాగునీటి రంగాన్ని ఎంతగానో తీర్చిదిద్దారు. వీరంతా నాకు నిత్య స్ఫూర్తిప్రదాతలు" అని సీఎం కొనియాడారు.

### పట్టిసీమ వల్లే రాయలసీమకు నీళ్లు.. కృష్ణా డెల్టా స్థిరీకరణ!

గతంలో పట్టిసీమ ప్రాజెక్టును కొందరు 'వట్టిసీమ' అంటూ అవహేళన చేశారని, ప్రాజెక్టు దండగ అన్నారని చంద్రబాబు గుర్తుచేశారు. "2014లో విభజన కష్టాల్లో ఉన్నప్పుడు బస్సులోనే బస చేసి, కృష్ణా డెల్టాను కాపాడటానికి పట్టిసీమ ప్రారంభించాం. 80 టీఎంసీల గోదావరి నీటిని తెచ్చి కృష్ణా డెల్టాను రక్షించాం. నీల వర్ణంలోని కృష్ణా జలాలు, అరుణ వర్ణంలోని గోదావరి జలాలు పవిత్ర సంగమంలో కలిసి ఈ ప్రాంతంలో బంగారం పండించాయి. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా స్థిరీకరణ జరగడం వల్లే శ్రీశైలంలో నీటిని పొదుపు చేసుకుని, ఆ నీటిని రాయలసీమ ప్రాంతానికి తరలించే వీలు కలిగింది. 2015 నుంచి 2025 వరకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల నీటిని తరలించాం. దీనికోసం మనం ఖర్చు పెట్టింది కేవలం రూ. 1300 కోట్లు మాత్రమే" అని లెక్కలతో వివరించారు.

### గత పాలకుల నిర్లక్ష్యం 'రాష్ట్ర ద్రోహం'

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత పాలకులు అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయినా పట్టించుకోలేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా మాట్లాడలేదు. ప్రాజెక్టుల నిర్వహణకు కనీసం గ్రీజు పూయడానికి కూడా పైసా ఇవ్వలేదు. అత్యంత కీలకమైన ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహించడం దేశ ద్రోహం, రాష్ట్ర ద్రోహం కిందకే వస్తుంది. 2014-19 మధ్య పోలవరంలో 72 శాతం పనులు పూర్తి చేస్తే గత ఐదేళ్లలో కనీసం 2 శాతం పనులు కూడా చేయకుండా డయాఫ్రామ్ వాల్ దెబ్బతినేలా చేశారు.

నేను నేరుగా 37 సార్లు పోలవరాన్ని సందర్శించి, 136 సార్లు సమీక్షించాను. ప్రస్తుతం ప్రాజెక్టు 89 శాతం మేర పూర్తయింది. నిర్వాసితులకు రూ. 2,250 కోట్లు చెల్లించాం" అని వివరించారు.

### రూ. 35 వేల కోట్లతో.. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టుల పూర్తి!

రాష్ట్రంలో నీటి వనరుల వినియోగం, ప్రాజెక్టుల భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. ప్రాధాన్యతా క్రమంలో ఉన్న 36 సాగునీటి ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లు ఖర్చు చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. "తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లు ఏర్పాటు చేయించాం. ధవళేశ్వరం బ్యారేజీకి కూడా రూ. 152 కోట్లతో కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించాం. వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తవుతాయి.

గుంటూరు ఛానల్ ఆధునీకరణకు ఈ నెలలోనే శంకుస్థాపన చేసి, రెండేళ్లలో పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పూర్తయింది. ఆగస్టు 14వ తేదీన గోదావరి జలాలకు అనకాపల్లి వద్ద అఖండ హారతి ఇచ్చి ఘనంగా స్వాగతం పలుకుతాం. పేరూరు బ్రాంచ్ కెనాల్‌కు 2026 ఆగస్టు 4న శంకుస్థాపన చేస్తాం. గత పాలకులు సొరంగంలో టన్నెల్ బోరింగ్ మిషన్ ఇరుక్కుపోయినా ప్రాజెక్ట్ ప్రారంభమంటూ నాటకాలు ఆడారు.
ఆ మోసాన్ని అధిగమించి వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను 2026 సెప్టెంబరు 1న జాతికి అంకితం చేస్తాం. ప్రతి వర్షపు చుక్కనూ భూగర్భ జలంగా మార్చేందుకు 'జలధార' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాం. గత ప్రభుత్వం నిలిపివేసిన పవిత్ర సంగమ హారతిని తిరిగి పునరుద్ధరిస్తామని" సీఎం చంద్రబాబు తెలియజేశారు నదుల అనుసంధానమే భారత ప్రగతికి అసలైన సోపానమని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. గంగా-కావేరి నదుల అనుసంధానం జరిగితే దేశ రూపురేఖలే మారిపోతాయని, రాష్ట్రంలో వంశధార నుంచి పెన్నా వరకు నదులను అనుసంధానించాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# రూ.2.19 లక్షల కోట్ల విలువైన 7 కీలక ప్రాజెక్టులు

ఈ వివరాలను వెల్లడించారు. దేశ అభివృద్ధికి అవసరమైన కీలక రంగాల్లో పెట్టుబడులను పెంచడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ నిర్ణయాల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

### సెమీకాన్ 2.0కు భారీ కేటాయింపు

క్యాబినెట్ ఆమోదించిన నిర్ణయాల్లో అత్యంత ప్రాధాన్యం పొందింది సెమీకాన్ 2.0 ప్రోగ్రామ్. ఇందుకోసం రూ.1,27,500 కోట్ల నిధులను కేటాయించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్లు లేదా చిప్‌లకు భారీ డిమాండ్ ఉంది. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆటోమొబైల్ పరిశ్రమ, రక్షణ రంగం వంటి అనేక విభాగాలు చిప్‌లపైనే ఆధారపడి ఉన్నాయి. ఇప్పటివరకు భారత్ చిప్‌ల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ఇప్పటికే సెమీకండక్టర్ మిషన్ ప్రారంభించింది. ఇప్పుడు రెండో విడతగా తీసుకొచ్చిన సెమీకాన్ 2.0 ద్వారా చిప్ డిజైన్, తయారీ, పరిశోధన, ప్యాకేజింగ్, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం అమలుతో దేశంలో దాదాపు రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. అంతేకాకుండా భారత్‌ను ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

### వారణాసికి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు

క్యాబినెట్ తీసుకున్న తొలి రెండు నిర్ణయాలు వారణాసి నగరానికి సంబంధించినవే. వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. మొదటి ప్రాజెక్టుగా వరుణా నది వెంట 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. దీనికి రూ.10,998 కోట్ల వ్యయం అవుతుంది. వారణాసి రింగ్ రోడ్‌ను జాతీయ రహదారి-31తో అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టు మొత్తం 43.21 కిలోమీటర్ల మేర నిర్మించబడుతుంది. రెండో ప్రాజెక్టుగా గంగా నది వెంట 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.14,448 కోట్లుగా అంచనా వేశారు. ఈ రెండు కారిడార్లు పూర్తయితే వారణాసిలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడమే కాకుండా పర్యాటక, వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఊతమివ్వనున్నాయి.

### యూరియాలో స్వయం సమృద్ధి లక్ష్యం

వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశాన్ని యూరియా ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా మార్చేందుకు "నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా-2026"కు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఎరువుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో యూరియా దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం అవసరమని కేంద్రం భావిస్తోంది. ఈ విధానం ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, రైతులకు ఎరువుల సరఫరాను మరింత స్థిరంగా ఉంచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణయానికి ప్రత్యేక ఆర్థిక కేటాయింపు లేకపోయినా, భవిష్యత్ పెట్టుబడులకు మార్గం సుగమం చేయనుంది.

### రైల్వే రంగానికి మరో రెండు ప్రాజెక్టులు

దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఒడిశాలోని పరదీప్- హరిదాస్‌పుర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్ల వ్యయాన్ని ఆమోదించింది. దీంతో పోర్టు ప్రాంతాల నుంచి సరుకు రవాణా మరింత సులభతరం కానుంది. అలాగే డంగోపోసి-రాజ్‌ఖర్సవాన్ మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్ల పెట్టుబడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తూర్పు భారతదేశంలో రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగనుంది.

### మొబైల్ తయారీకి రూ.62,500 కోట్ల ప్రోత్సాహం

దేశీయ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్రం మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఎంపీఎంఎస్) లేదా పీఎల్ఐ 2.0 పథకానికి రూ.62,500 కోట్లతో ఆమోదం తెలిపింది. ఒకప్పుడు మొబైల్ ఫోన్ల కోసం దిగుమతులపైనే ఆధారపడిన భారత్, ప్రస్తుతం ప్రపంచంలోనే ప్రధాన స్మార్ట్‌ఫోన్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఎదుగుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 300కు పైగా మొబైల్ తయారీ యూనిట్లు పనిచేస్తున్నాయి. 2024-25లో భారత్ నుంచి రూ.2.62 లక్షల కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయి. వీటిలో యాపిల్ ఫోన్ల వాటా అధికంగా ఉంది.అలాగే దేశీయ మొబైల్ తయారీ విలువ 2019-20లో రూ.2.14 లక్షల కోట్లుగా ఉండగా, 2024-25 నాటికి రూ.5.5 లక్షల కోట్లకు పెరిగింది. కొత్త పీఎల్ఐ 2.0 పథకం ద్వారా మరిన్ని కంపెనీలు భారత్‌లో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.ఈ కథనాన్ని మరింత విశ్లేషణాత్మకంగా లేదా టీవీ బులెటిన్ శైలిలో కూడా మార్చవచ్చు.

# మీ భవిష్యత్తుకు నాదీ హామీ

తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్-2.0లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి 18 స్థానం వచ్చిందన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించామన్నారు.విద్యార్థులకు తెలంగాణ విద్యా కిట్ కింద 9 వస్తువులు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రూ.1000 కోట్లతో 27,50,000 మంది విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీలోపు ఈ కిట్ను ఇవ్వనున్నట్లుగా వెల్లడించారు. ఒక్కో విద్యార్థి చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8లక్షలు ఖర్చు చేస్తుందని వివరించారు. ఒకప్పుడు స్టడీటూర్కు ఐఏఎస్లు వెళ్లేవారని, ఈ ఏడాది టీచర్లను స్టడీటూర్కు సింగపూర్, సౌత్ కొరియా లాంటి దేశాలకు పంపించామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్నగర్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు."ఒక్కో విద్యార్థిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీపడాలి. మీ భవిష్యత్కు నాదీ హామీ. క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు.

# అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్

స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ పనుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను ముఖ్యమంత్రికి వివరించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నమూనా వంటి కీలక అంశాలను ప్రాజెక్టులో భాగంగా చేర్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగాలు కల్పించడం ద్వారా అమరావతి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అమరావతిని ఆర్థికంగా పరిపుష్టం చేసేలా 'క్రియేటివ్ సిటీ' నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. ఎల్‌నినోతో ఇబ్బందులు ఎదురైనా, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడంతో రాజధాని ప్రాంతం జలకళను సంతరించుకుందని గుర్తుచేశారు. గ్లోబల్ బెంచ్‌మార్కింగ్ చేరుకోవడం, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి.నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఓటర్లకు భారీ ఊరట

పేరు సవరణ, మార్పులు, అభ్యంతరాల స్వీకరణకు ఆగస్ట్ 10వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు గడువు కల్పించారు. ఈ దరఖాస్తులపై విచారణ, నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియను అక్టోబర్ 8వ తేదీ నాటికి పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక అక్టోబర్ 12వ తేదీన తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోందని కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా పలు రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు కూడా అందలేదని అందుకే ఎస్ఐఆర్ గడువు పెంచాలని చేసిన విజ్ఞప్తితో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్‌ను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. అయితే ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసినట్లు ఎస్ఐఆర్ ప్రక్రియలో అవసరమైన ఫారాలు సమర్పించకపోతే లేదా వివరాలు నమోదు చేయకపోతే ఓటరు జాబితాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి అర్హులైన ప్రతి ఓటరు నిర్ణీత గడువులోపు వివరాలను ధృవీకరించి అవసరమైన ఫారాలను సమర్పించాలని ఎన్నికల సంఘం అధికారులు సూచిస్తున్నారు.

# పరిశ్రమలకు అనుకూల వాతావరణం సృష్టిస్తాం

రేవంత్ రెడ్డి ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవత్ రెడ్డి మాట్లాడారు.'కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న దిండి, పాలమూరు - - రంగారెడ్డి, కల్వకుర్తి, బీమా నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి పక్క రాష్ట్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేస్తా

'ఈ ప్రాజెక్టులకు సంపూర్ణమైన అనుమతులను సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యత తీసుకుంటా. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనే. నేను ఈ పాలమూరు జిల్లా వాడిగా అత్యంత వెనుకబడిన ఈ జిల్లాను అత్యంత అభివృద్ధి చెందిన ఆదర్శవంతమైన జిల్లాగా అభివృద్ధి చేసుకుందాం'అని జిల్లా వాసులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. విద్య, నీటిపారుదల, పారిశ్రామాభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యతగా పరిగణించి పాలమూరు జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రతి నియోజకవర్గానికి ఏటీసీలు తీసుకొచ్చినట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### తెలంగాణ రైజింగ్ విజన్‌కు అమర రాజా సంస్థ మద్దతుగా నిలవాలి

'పెట్టుబడులకు సంబంధించి గత ప్రభుత్వాలు అమలు చేసిన విధానాల్లో ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే వాటిని మార్చకుండా మరింత మెరుగుపరిచి పాలసీలను తెచ్చాం. పెట్టుబడులను ఆకర్షించడానికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను నిర్దేశించాం. టూరిజం, ఎనర్జీ, మెడికల్, స్పోర్ట్స్ పాలసీను తీసుకొచ్చాం. తెలంగాణ రైజింగ్ విజన్‌కు అమర రాజా సంస్థ మద్దతుగా నిలవాలి'అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.'పారిశ్రామికంగా అభివృద్ధి సాధించడానికి పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు భూములు ఇచ్చారు. పరిశ్రమలు అత్యధిక ఉద్యోగాలు ఈ ప్రాంతం వారికే ఇవ్వాలి. చిన్న సహాయాన్ని కూడా జీవితాంతం గుర్తుపెట్టుకునే ఇక్కడ ప్రజలను అక్కున చేర్చుకోవాలి'అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

### అమర రాజా సంస్థలో 700 ఉద్యోగుల్లో 400 మంది మహిళలు

'వాతావరణంలో శరవేగంగా మార్పులొస్తున్నాయి. ఎల్‌నినో కారణంగా రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యాన్ని తగ్గించుకుని కాలుష్య రహిత దేశంగా ఈ దేశాన్ని తీర్చిదిద్దాలంటే వాహన కాలుష్యాన్ని నియంత్రించాలి. అందుకు ఈవీ వాహనాలను వినియోగం పెరగాలి'సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'ఈవీ బ్యాటరీలు ప్రాధాన్యత పెరిగింది. ఈ నేపథ్యంలో 32 గిగాబైట్ సామర్థ్యం కలిగిన యూనిట్ అమర రాజా స్థాపించడం సంతోషం. అమర రాజా సంస్థలో 700 ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం గర్వకారణం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### అమర రాజా సంస్థ ప్రపంచంతో పోటీపడే సంస్థ

'పాలమూరు జిల్లాలో నూతనంగా పరిశ్రమను ఏర్పాటు చేసి, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్న అమర రాజా యాజమాన్యాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. 1983లో అమర రాజా యాజమన్యం చిత్తూరులో ప్రారంభించి, దాదాపు 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో బయట రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్టడం మనకందరికీ గర్వకారణం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.'అమర రాజా సంస్థ ప్రపంచంతో పోటీపడే సంస్థ. లోకల్ టాలెంట్‌తో గ్లోబల్ సంస్థలతో పోటీ పడుతున్న అమర రాజా సంస్థతో పోటీ పడే సంస్థ ఈ దేశంలో ఏదీ లేదు. చైనా, జపాన్, జర్మనీతో కొన్ని అంశాల్లో సౌత్ కొరియాతో పోటీపడుతుంది. దేశాలనే ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తోంది'అని అమర రాజా సంస్థను అభినందించారు.

### అమర రాజా యాజమాన్యాన్ని ప్రోత్సహించాలి

'ప్రపంచంలో ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా, ఈవీ బ్యాటరీలు, ఈవీ వాహనం కావాలన్నా, ఈవీకి సంబంధించిన ఏ ఉత్పత్తయినా చైనా మీద ఆధారపడుతుంది. చైనా లీడర్ ఆఫ్ ఈవీ ప్రొడక్ట్స్. అలాంటి దేశంతో పోటీపడటానికి ప్రయత్నం చేస్తున్న అమర రాజా యాజమాన్యాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్ , ఎంపీ డీకే అరుణ, ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతోపాటు అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. గతేడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 108 దేశాల నుంచి పరిశ్రమలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దతామని పేర్కొన్నారు.

2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా కృషి చేస్తామని అన్నారు.ఈ లక్ష్యాల సాధనకు భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అవసరమని, అందుకే 'తెలంగాణ రైజింగ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగరంలోని పరిశ్రమలను దశలవారీగా తరలిస్తామని, మెట్రో విస్తరణ చేపడతామని సీఎం వెల్లడించారు. డీజిల్ తో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలికి తరలించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి జీరో ట్యాక్స్ విధించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి కాలుష్య రహితంగా మారుస్తామని, మెట్రో విస్తరణ, మూసీ పునరుద్ధరణ, పరిశ్రమల తరలింపుతో కూడిన ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)'గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో సేవల రంగానికి అనుగుణంగా పునర్నిర్మిస్తామని చెప్పారు.

అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిని తయారీ పరిశ్రమల (మ్యాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని రేవంత్ అన్నారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా తగిన పరిహారం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# ఏపీకి ప్రశంసలు.. రేవంత్ సర్కార్‌పై విమర్శలు

అక్కడ అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చని ప్రతిపాదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒ ఓచెరో రూ.250 కోట్ల చొప్పున 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' అందిస్తే, ప్లాంట్ కార్యకలాపాలను పునఃప్రారంభించవచ్చని కేటీఆర్ సూచించారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 6,000 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కేటీఆర్ విన్నపంపై కేంద్రమంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు అందించిన తరహాలోనే ఇక్కడి ప్లాంట్‌కు కూడా మద్దతు ఇవ్వాలని, లేనిపక్షంలో ఫ్యాక్టరీని తెరిపించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

### మీడియాతో మాట్లాడిన కేటీఆర్

ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పోరాటం, ఆందోళన తెలంగాణ ప్రయోజనాల కోసమే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి ద్వేషం లేదని, అయితే ఆయన తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మాత్రమే తాము ప్రశ్నిస్తున్నామని తెలిపారు.
ప్రజల దృష్టిని మళ్లించడంలో రేవంత్ రెడ్డి అందెవేసిన చేయి అని, ఆ విద్యలో ఆయన ఇప్పటికే నాలుగైదు పీహెచ్‌డీలు చేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 31 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ తమ పార్టీనే లక్ష్యంగా చేసుకోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పార్టీ అని వ్యాఖ్యానిస్తున్న ముఖ్యమంత్రి, మరి మళ్లీ తమ పార్టీనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, దీనిపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి 76 పర్యాయాలు ఢిల్లీకి వెళ్లినా, రాష్ట్రానికి కనీసం 76 పైసలైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ సహా పలు అంశాల్లో ఆధారాలు లేకుండా తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# సర్వం జగన్నాథం

- భక్తిభావం వెల్లువెత్తే అపురూపం క్షణం జగన్నాథ రథయాత్ర
- ప్రతి దేవతా స్వరూపంలో ఆ దేవతా స్వభావం, శక్తి, పాత్రను ప్రతిబింబించే నిగూఢ రహస్యం నిక్షిప్తమై ఉంది.
- భక్తి , సమత్వం , మోక్షమార్గాలకు ప్రతీక జగన్నాథ స్వామి రథయాత్ర





ఒడిశా రాష్ట్రంలోని పూరీలో కొలువైన శ్రీ జగన్నాథ స్వామి చరిత్ర పురాణ ప్రసిద్ధమైనది. కృష్ణుడు, బలరాముడు, సుభద్రలను ఇక్కడ అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ ఆలయం క్రీ.శ. 12వ శతాబ్దంలో చోడగంగ దేవునిచే ప్రారంభించబడి, అనంగభీమ దేవునిచే పూర్తి చేయబడిందని పురాణాల వచనం. ఇక్కడ స్వామి వారి నూతన కలప విగ్రహాలను ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి తయారుచేసి రహస్య బ్రహ్మ పదార్థాన్ని బదిలీ చేస్తారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన శ్రీ జగన్నాథ రథయాత్రకు రెండు రోజులు ముందు అమావాస్య నాడు, నూతన దేవతామూర్తుల నేత్రోత్సవంతో ప్రత్యేక పూజలు మొదలవుతాయి. మరుసటి రోజు ప్రజలకు నవయవ్వన దర్శనం లభిస్తుంది. ఆషాఢ శుక్ల విదియనాడు పాండాలు మేళతాళాలతో ఉదయకాల పూజలు నిర్వహించి మనిమా (జగన్నాథా) అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తు విగ్రహాలను కదిలించి ఆనందబజారు, అరుణస్తంభం మీదుగా అత్యంత కోలాహల వాతావరణంలో ఊరేగిస్తు రథం వెనక భాగం నుంచి తీసుకువచ్చి రత్నపీఠంపై అలంకరింపజేస్తారు. ఈ ఉత్సవాన్ని పహండీ అనే ఈ ఉత్సవం కులమతాలకతీతంగా నిర్వహిస్తారు. ఇక గుండిచా ఆలయానికి వెళ్లేందుకు సిద్ధమైన సుభద్ర, జగన్నాథ, బలభద్రులు రథారూఢులై ఉండగా ఇలపై నడిచే విష్ణువుగా గౌరవాభిమానాల్ని అందుకునే పూరీ రాజు పల్లకీలో అక్కడికి చేరుకోవడంతో సంరంభాలు మిన్నంటుతాయి. పరమాత్ముని ముందు సేవకుడిగా మారిన ఆ మహారాజు బంగారపు చీపురుతో రథాల లోపల ఊడుస్తాడు. దీన్నే చెరా పహారా అంటారు.

## జగన్నాథుడి రూపం వెనుక నిగూఢ పరమార్థం

పురాణాల ప్రకారం ఇంద్రయుమ్నుడు అనే రాజు విష్ణు భక్తుడు. ఆయన ప్రత్యేకమైన, పవిత్రమైన విగ్రహంతో గొప్ప ఆలయాన్ని నిర్మించాలని కోరుకుంటారు. అయితే, కలలో శ్రీకృష్ణుడు కనిపించి తన పరిపూర్ణ రూపాన్ని కనుగొనాలని చెప్పాడు. విగ్రహాలను అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు దేవశిల్పి విశ్మకర్మ సహాయం కోరుతాడు. ఇందుకు అంగీకరించిన విశ్వకర్మ ఓ షరతును విధిస్తాడు. తన పని పూర్తయ్యే వరకు ఎవరు తనను ఇబ్బంది పెట్టవద్దని, గది ద్వారాలు తెరవవద్దని కోరగా అందుకు రాజు అంగీకరిస్తాడు. అయితే, రోజులు గడిచినా విగ్రహం తయారీకి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియక పోవడంతో మహారాణి ఆందోళన వ్యక్తం చేస్తు ఒకసారి విగ్రహాల పనులు ఎంత వరకు వచ్చాయో చూడాలని రాజును కోరుతుంది. దీంతో రాజు గది ద్వారాలు తెలియగానే విశ్వకర్మ అక్కడి నుంచి అదృశ్యమవుతాడు. జగన్నాథుడి మొహం మాత్రమే కలిగి అసంపూర్ణమైన విగ్రహాలు కనిపిస్తాయి. దాంతో మహారాజు తీవ్ర మనోవేదనకు గురవుతాడు. అప్పుడు శ్రీకృష్ణుడు మళ్లీ రాజు కలలో కనిపించి అసంపూర్తిగా ఉన్న విగ్రహాలనే ప్రతిష్టించాలని చెబుతాడు. అప్పటి నుంచి అదే రూపంలో జగన్నాథుడు పూజలందుకుంటున్నాడుహిందూ ధర్మంలో దేవుని రూపం ఒక కళాత్మక ప్రతిమ మాత్రమే కాదు. అది ఆయన దివ్య గుణాలు, లీలలు, సందేశాలకు ప్రతీకగా నిలుస్తుంది. ప్రతి దేవతా స్వరూపం వెనుక ఓ అంతరార్థం ఉంటుంది. అది ఆ దేవత స్వభావాన్ని, శక్తిని, పాత్రను ప్రతిబింబిస్తుంది. అలాంటి విభిన్నమైన, ఎంతో రహస్యమైన స్వరూపం పూరీ జగన్నాథునిది. విష్ణువు, శ్రీకృష్ణుడి అవతారంగా జగన్నాథుడు పూజలందుకుంటున్నాడు. పూరీ జగన్నాథ మందిరంలో పూజలందుకుంటున్న జగన్నాథుడి స్వరూపాన్ని తొలిసారి చూసిన ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఈ విగ్రహంలో చేతులు, కాళ్లు కనిపించవు. కానీ, పెద్ద పెద్ద గుండ్రటి కళ్ళు కనిపిస్తాయి. కనురెప్పలు ఉండవు. ఈ విగ్రహాన్ని చూసి సాధారణంగా అందరూ 'అసాధారణమైన రూపం'గా భావిస్తారు. రూపం వెనుక ఎంతో నిగూఢమైన అర్థం ఉంది. స్వామివారు ఈ రూపంలో భక్తుడిని నిరంతరం చూస్తున్నాడన్న సందేశాన్ని మనకు ఇస్తుంది. క్షణం తీరిక లేకుండా సృష్టిని గమనిస్తు ఆ దేవదేవుడు భక్తులను అనుగ్రహిస్తున్నట్లుగా భావిస్తారు

## రథయాత్ర ప్రాముఖ్యత

ఒడిశాలోని పూరీలో జరిగే జగన్నాథ రథయాత్ర అత్యంత విశిష్టమైన హిందూ పవిత్రోత్సవం. శ్రీకృష్ణుడి అవతారమైన జగన్నాథుడు, ఆయన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి ఏటా గుండిచా ఆలయానికి వెళ్లే ఈ యాత్ర భక్తి, సమత్వం, మోక్ష మార్గాలకు ప్రతీకగా నిలుస్తుంది.

## సకల జనుల దర్శనం

జగన్నాథ ఆలయంలో సాధారణంగా విదేశీయులకు, ఇతర మతాల వారికి ప్రవేశం ఉండదు. కానీ రథయాత్ర సమయంలో స్వామివారే స్వయంగా వీధుల్లోకి వచ్చి కులమతాలు, వర్ణభేదాలు లేకుండా అందరికీ దర్శన భాగ్యం కల్పిస్తారు. ఈ రథాన్ని తాకడం లేదా లాగడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగి, మోక్షం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రతి సంవత్సరం పవిత్ర వృక్షాల నుంచి మూడు భారీ చెక్క రథాలను కొత్తగా తయారు చేస్తారు. జగన్నాథుని రథాన్ని నందిఘోష, బలభద్రుని రథాన్ని తాళధ్వజ, సుభద్ర రథాన్ని దేవదళన అని పిలుస్తారు

## రథల నిర్మాణం

ఎంతో ప్రాచుర్యం పొందిన జగన్నాథ స్వామి రథయాత్రకు అరవై రోజుల ముందు, వైశాఖ బహుళ విదియనాడు అంకురార్పణ జరుగుతుంది. పూరీ మహారాజు పూజారుల్ని పిలిపించి, కలప సేకరించాల్సిందిగా ఆదేశిస్తాడు. సామంతరాజు దసపల్లా అందుకు అవసరమైన వృక్షాల్ని గుర్తించి వాటికి వేదపండితులచే శాంతి నిర్వహించాక వాటిని జాగ్రత్తగా నరికి 1,072 కాండాలను పూరీకి తరలిస్తారు. రథాల నిర్మాణానికి 13 వేల ఘనపుటడుగుల కలప అవసరమవుతుంది. ఆలయ ప్రధాన పూజారి నేతృత్వంలోని శిల్పుల బృందం అక్షయ తృతీయనాడు రథాల తయారీకి శ్రీకారం చుడుతారు. ముందు వృక్ష కాండాల్ని 2,188 ముక్కలు చేస్తారు. వాటిలో 832 ముక్కల్ని జగన్నాథుడి రథం కోసం, 763 ముక్కల్ని బలభద్రుడి రథం కోసం, 593 ముక్కల్ని సుభద్రాదేవి రథం కోసం వినియోగిస్తారు. రథాల తయారీలో ఎక్కడా యంత్రాల్ని వాడకపోవడం విశేషం. జగన్నాథుడి రథం నందిఘోష. ఎత్తు సుమారు 46 అడుగులు, పదహారు చక్రాలుంటాయి. ఒక్కో చక్రం ఎత్తు ఆరు అడుగులు. సారథి పేరు దారుక. బలభద్రుడి రథం తాళధ్వజం. సుభద్రాదేవి రథం దేవదళన్. రథాల నిర్మాణం పూర్తయ్యాక, యాత్రకు ఒకరోజు ముందు వాటిని ఆలయ తూర్పు భాగంలోని సింహ ద్వారం వద్ద నిలుపుతారు. లాగేందుకు అనువుగా ఒక్కో రథానికీ 250 అడుగుల పొడవు, ఎనిమిది అంగుళాల మందం ఉన్న తాళ్లను రథాలకు కడతారు.

## ఘోషయాత్ర

రథానికున్న తాళ్లతో రథాన్ని లాగడంతో ప్రపంచ ప్రఖ్యాత జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుంది. ఆ సమయంలో స్వామిని పతితపావనుడు అంటు కీర్తిస్తూ ఈ క్షణం కోసమే ఎదురు చూస్తున్న లక్షలాది మంది భక్తులు ఒక్కసారిగా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు దూకుతారు. మిన్నంటిన జయజయధ్వానాల మధ్య రథాలు భారంగా కదులుతాయి. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేరుకోవడానికి 12 గంటల సమయం పడుతుంది. గుండిచా ఆలయానికి చేరుకున్నాక సుభద్ర, బలరాముడు, శ్రీకృష్ణుని మూలవిరాట్టులకు ఆ రాత్రి ఆలయం బయట రథాల్లోనే విశ్రాంతినిస్తారు. మర్నాడు ఉదయం మేళతాళాలతో మూలవిరాట్లను ఆలయంలోకి తీసుకువెళతారు. స్వామి అక్కడ ఏడురోజుల పాటు ఉంటాడు. ఐదోరోజున ఓ ఆసక్తికరమైన విశేషం జరుగుతుంది. ఆలయంలోకి తనతోపాటు తీసుకెళ్లలేదని అలిగిన లక్ష్మీదేవి, గుండిచా గుడి బయటి నుంచే జగన్నాథుడిని ఓరకంట దర్శించి పట్టలేని కోపంతో స్వామి వారి రథాన్ని కొంతమేర ధ్వంసం చేసి వెనక్కి వెళ్లిపోతుంది. ఈ ముచ్చట అంతా అమ్మవారి పేరిట పూజారులే జరిపిస్తారు. ఆ రోజును హీరాపంచమి అంటారు. వారంపాటు గుండిచాదేవి ఆతిథ్యం స్వీకరించిన సుభద్ర, జగన్నాథ, బలభద్రులు దశమినాడు తిరుగు ప్రయాణమవుతారు. దీన్ని బహుదాయాత్ర అంటారు. జగన్నాథుడు మాత్రం దారిలో అర్ధాసని (మౌసీమాగా ప్రసిద్ధి) గుడి దగ్గర ఆగి తియ్యటి ప్రసాదాల్ని ఆరగిస్తాడు. మధ్యాహ్నానికి మూడు రథాలు ఆలయానికి చేరుకుంటాయి. తరువాత రోజు, ఏకాదశి నాడు స్వామి వార్లను బంగారు ఆభరణాలతో (సునాబెష) అలంకరించి దర్శనానికి అనుమతిస్తారు. ఆ దృశ్యం అద్వితీయం. ద్వాదశినాడు మళ్లీ విగ్రహాలను రత్నసింహాసనంపై ప్రతిష్ఠించడంతో రథయాత్ర పూర్తవుతుంది. స్వామిలేక చిన్నబోయిన పూరీ ఆలయం, జగన్నాథుడి రాకతో కొత్తకళ సంతరించుకుంటుంది.

**శ్రీజగన్నాథ రథయాత్ర సందర్భంగా**

# ప్రతినెలా 100కుపైగా మొబైల్ ఫోన్ల రికవరీ

- ఈ ఏడాది ఇప్పటివరకు 1.27 కోట్ల విలువైన 794 ఫోన్లు స్వాధీనం
- గత 30 రోజుల్లోనే ?21.76 లక్షల విలువైన 136 మొబైల్ ఫోన్లు రికవరీ చేసిన ప్రత్యేక బృందం
- 8.12 కోట్ల విలువైన ఫోన్లు బాధితులకు అప్పగింత
- మీ ఫోన్ పోయిందా? ఆందోళన వద్దు.. అఇఎఖీ పోర్టల్‌తో తిరిగి పొందండి




**కామారెడ్డి** మొబైల్ ఫోన్ పోయిందని లేదా చోరీకి గురైందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అఇఎఖీ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సులభంగా తిరిగి పొందవచ్చని కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, భరోసా ఇచ్చారు. ప్రస్తుత డిజిటల్ కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, కీలకమైన డేటాను కలిగి ఉండే అత్యంత ముఖ్యమైన పరికరమని ఆయన పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రతకు, గోప్యతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున, జిల్లా పోలీసు యంత్రాంగం మొబైల్ ఫోన్ల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని వివరించారు.బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలనే లక్ష్యంతో ఇన్‌స్పెక్టర్ శ్రీ సంపత్ పర్యవేక్షణలో, ఆర్ఎస్ఐ శ్రీ బాలరాజు మరియు ఐదుగురు కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక సాంకేతిక బృందాన్ని (రాజూవఇతిజీశ్రీ ంవజీఎ) ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి నెల సగటున 100కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తూ బాధితుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు.జిల్లాలో రికవరీల గణాంకాలను వెల్లడిస్తూ.. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 30 రోజుల్లోనే ?21.76 లక్షల విలువైన 136 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, అలాగే ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు ?1.27 కోట్ల విలువైన 794 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గత ఏడాది కూడా సుమారు ?3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని గుర్తుచేశారు.సీఈఐఆర్ (అఇఎఖీ) పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కామారెడ్డి జిల్లాలో మొత్తం 5075 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, గుర్తించి సుమారు ?8.12 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు విజయవంతంగా అప్పగించడం జరిగిందని ఎస్పీ గారు తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక బృందాన్ని ఆయన అభినందించారు.మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, కాలయాపన చేయకుండా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా సిమ్ కార్డును బ్లాక్ చేయాలని సూచించారు. అనంతరం అఇఎఖీ పోర్టల్‌లో ఫోన్ ఎఓఇఎ నంబర్‌ను బ్లాక్ చేయాలని కోరారు. పోయిన మొబైల్ ఫోన్ల ద్వారా సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున, గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.రికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ శ్రీ బాలరాజు (ఫోన్: 8712686114) గారిని సంప్రదించి తమ మొబైల్ ఫోన్లను పొందవచ్చని తెలిపారు.

# ఆయిల్ పరిశ్రమలో కార్మికుడి మృతి..ఉద్రిక్తత

**నల్లజర్ల** తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అయ్యవరం లో 3ఎఫ్ ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం నాడు ఆయిల్ పామ్ పరిశ్రమ లో నీటి ట్యాంక్ లో పడి సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాజేంద్ర అనే కార్మికుడు మృతి చెందాడు. రాజేంద్ర మృతి పై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ త్రీ ఎఫ్ ఆయిల్ పామ్ పరిశ్రమ వద్ద ధర్నాకు దిగారు. పోలీసులు ఫ్యాక్టరీ వద్ద భారీగా మోహరించారు. ఫ్యాక్టరీ వద్ద ధర్నా కు దిగిన సీఐటీయూ నాయకులను బంధువులను పోలీస్ జీప్ లు ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# తెలంగాణలో వింత వాతావరణం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రుతుపవనాలు బలహీనపడటంతో వర్షాకాలంలోనూ పొడి వాతావరణం కొనసాగుతోంది. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, నేడు ఐదు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. బుధవారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గురువారం తీవ్రమైన ఉక్కపోత ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటితో పాటు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా జులై 22 వరకు పొడి వాతావరణమే కొనసాగుతుందని, తేలికపాటి జల్లులు మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క హన్మకొండ జిల్లాలోనే ఈ జులై నెలలో ఇప్పటివరకు 65 శాతం వర్షపాతం లోటు నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, ఇటీవల నల్గొండలో 38.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్నప్పటికీ, రుతుపవన ద్రోణి రాష్ట్రంలో వర్షాలకు అనుకూలంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

# ఇసుక, కంకర (గ్రావెల్) అక్రమ తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు

- అనుమతి పొందిన ప్రతి వాహనానికి విండ్‌స్క్రీన్‌పై పర్మిట్ తప్పనిసరి
- అక్రమాలకు పాల్పడితే రీచ్‌ల అనుమతులు రద్దు చేస్తాం
- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్
- రెవెన్యూ, మైనింగ్ శాఖలతో సమన్వయంతో సంయుక్త దాడులు
- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు

**తిరుపతి,** జిల్లాలో ఇసుక, కంకర (గ్రావెల్) అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మిని కాన్ఫిరెన్స్ హాలు నందు రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో ఇసుక, కంకర తవ్వకాల నియంత్రణ, అనుమతులు, రవాణా, పర్యవేక్షణ, అమలు చర్యలపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని ప్రాంతాల్లో ఇసుక, కంకర తవ్వకాలు, అక్రమ నిల్వలు, అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే తవ్వకాలు, రవాణా జరిగేలా క్షేత్రస్థాయిలో పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అనుమతులు పొందిన ఇసుక రీచ్‌లు, క్వారీల నుంచి ఖనిజాలను తరలించే ప్రతి వాహనానికి సంబంధిత అనుమతి పత్రాన్ని (పర్మిట్) విండ్ స్క్రీన్‌పై తప్పనిసరిగా ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాల నమోదు సంఖ్యలతో కూడిన పూర్తి జాబితాను రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు అందజేయాలని సూచించారు. ప్రతి వాహనం ఆన్‌లైన్ బిల్లు, అనుమతి పత్రాలతోనే రవాణా చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా శాఖలు పరస్పర సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అనుమతులు లేని వాహనాలు, అక్రమ తవ్వకాలపై తక్షణమే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పునరావృతం కాకుండా సమర్థవంతమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్త టాస్క్‌ఫోర్స్‌గా పనిచేసి అందిన ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టులు, కీలక రహదారుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంతో పాటు ఇతర జలవనరుల వద్ద అనుమతించిన హద్దులను దాటి ఇసుక తవ్వకాలు జరగకుండా నీటిపారుదల, రెవెన్యూ శాఖలు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన రీచ్‌లు, వాహనాలపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి పొందిన రీచ్‌కు చెందిన వాహనం అక్రమ రవాణాలో పట్టుబడితే సంబంధిత రీచ్ అనుమతిని రద్దు చేయడంతో పాటు అవసరమైతే తాత్కాలికంగా సస్పెండ్ చేసే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక ప్రజల గృహ నిర్మాణ అవసరాల కోసం ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగే చిన్నస్థాయి ఇసుక రవాణాకు ఇబ్బందులు కలిగించవద్దని, అయితే పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు, డంపింగ్ చేసి టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడుతూ అక్రమ ఇసుక, కంకర రవాణా పై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖలతో సమన్వయం చేసుకుని సంయుక్త దాడులు నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమ రవాణా, తవ్వకాలలో పాల్గొనే వ్యక్తులు, వాహనాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎటువంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిబంధనలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లాలో ఇసుక, కంకర అవసరాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు సరఫరా, జాతీయ రహదారుల నిర్మాణ పనులకు అవసరమైన ఖనిజాల లభ్యత, అనుమతుల ప్రక్రియ, అక్రమ తవ్వకాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, శాఖల వారీగా బాధ్యతలు, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థపై సవివరంగా చర్చించారు.

ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాశ్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, జిల్లా రవాణా అధికారి మురళీ మోహన్, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీ నాయక్, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్లు (తిరుపతి, చిత్తూరు నెల్లూరు, చెన్నై), నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టం అమలుపై కీలక సూచనలు

బాధితులను, వారి కుటుంబాలను బెదిరించే ధోరణి పెరుగుతోందని పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో ఒక పోక్సో నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చి, బాధితురాలితో పాటు ఆరుగురిని అతి దారుణంగా హత్య చేసిన ఉదంతాన్ని ఆయన ఉదాహరణగా చూపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, బాధితులకు రక్షణ కల్పించే పటిష్టమైన యంత్రాంగం రాష్ట్రంలో అవసరమని ఆయన స్పష్టం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయడానికి పలు కీలక సూచనలను ఆయన ఈ లేఖలో పొందుపరిచారు. దర్యాప్తు అధికారులకు బాలల పట్ల సున్నితమైన వైఖరి, ఫోరెన్సిక్ , డిజిటల్ సాక్ష్యాల సేకరణలో ప్రత్యేక శిక్షణ ఉండాలన్నారు. బాధితుల వైద్య పరీక్షలు 24 గంటల్లోపు జరగాలి. సాక్ష్యాల సేకరణలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. పోక్సో కేసుల దర్యాప్తు , ఛార్జిషీట్ దాఖలు నిర్ణీత కాలవ్యవధిలో 60-90 రోజుల్లో పూర్తి కావాలన్నారు.

నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడానికి సమగ్రమైన నివేదికలు సమర్పించాలి, అలాగే బాధితులకు రక్షణ కల్పించే 'విక్టిమ్ ప్రొటెక్షన్ ప్లాన్' ఉండాలని సూచించారు. నేర చరిత్ర ఉన్న నిందితులపై రౌడీ షీట్లు తెరిచి, వారిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి సమగ్రమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ జారీ చేయాలని, జిల్లా , రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ సెల్స్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పాఠశాలలు, వసతి గృహాలు, మరియు పూజా స్థలాల్లో పనిచేసే వారిపై ఆరోపణలు వస్తే, నిబంధనల ప్రకారం వెంటనే పోలీసులకు నివేదించేలా ప్రోటోకాల్ ఉండాలని ఆయన సూచించారు. పోక్సో కేసులను సాధారణ పరిపాలనా వ్యవహారాలుగా చూడకూడదని, ప్రతి ఫిర్యాదుపై అత్యంత సున్నితంగా, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

తన సూచనల అమలుపై తీసుకున్న చర్యలను 30 రోజుల్లోపు నివేదిక రూపంలో తెలియజేయాలని కోరుతూ, తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మై భారత్ పోర్టల్ నమోదు కార్యక్రమం ప్రారంభం




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ‘ మై భారత్ పోర్టల్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు.మేడ్చల్-మల్కాజిగిరి, తెలంగాణ దేశ నిర్మాణ కార్యక్రమాలలో యువత భాగస్వామ్యాన్ని గరిష్ఠం చేసే లక్ష్యంతో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఈ రోజు మై భారత్ పోర్టల్‌లో నమోదు కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఫైజాన్ అహ్మద్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి, 15 నుండి 29 ఏళ్ల మధ్య వయస్సు గల అర్హులైన యువత అంతా ‘ మై భారత్ ‘ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సేవ, అనుభవపూర్వక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవ భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ యువజన-కేంద్రీకృత కార్యక్రమాలలో పాల్గొనే అవకాశాలను ఈ వేదిక కల్పిస్తుందని ఆయన వివరించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఈ నమోదు కార్యక్రమంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఇతర భాగస్వామ్య పక్షాలు చురుకుగా పాల్గొని, అర్హులైన యువత గరిష్ఠ సంఖ్యలో నమోదు చేసుకునేలా చూడాలని ఆయన కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి మై భారత్ ‘ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్, ఆఫీస్ అసిస్టెంట్ డి. శ్రీశైలం పాల్గొన్నారు. వీరు నమోదు ప్రక్రియతో పాటు, ‘ మై భారత్ పోర్టల్ ద్వారా నమోదైన యువతకు లభించే ప్రయోజనాలు, అవకాశాల గురించి ఈ సందర్భంగా వివరించారు.ఈ విస్తృత నమోదు కార్యక్రమం కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు మరియు ఇతర ప్రభుత్వ సంస్థలలో అవగాహన కార్యక్రమాలు మరియు అక్కడికక్కడే నమోదు చేసుకునే శిబిరాల ద్వారా నిర్వహించబడుతుందన్నారు.ఈ ప్రచార కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం సహకారంతో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ విభాగం సమన్వయం చేస్తోంది.అర్హులైన యువత అంతా మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, ‘వికసిత్ భారత్’ లక్ష్య సాధనలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు

### - కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ నియోజకవర్గంలోని మేడ్చల్ డివిజన్ పరిధిలోని జి ఎన్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్,పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ విజయ రామారావు,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్,మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శ్రీ మలిపెద్ది సుధీర్ రెడ్డి ,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి ,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ విచ్చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పార్టీ బలోపేతం కృషి చేయాలని తెలియజేసారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు)ముదిరాజ్,298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గర్శాల సురేందర్ ముదిరాజ్,అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష కృష్ణారెడ్డి,మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రేగు రాజు కురుమ,దుర్గం శివ శంకర్ ముదిరాజ్,మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ,జాకట దేవరాజ్,కౌడే మహేష్ కురుమ,మర్రి నర్సింహారెడ్డి,వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా,బత్తుల మధుకర్ యాదవ్,నారెడ్డి రవీందర్ రెడ్డి,సాటే నరేందర్ వంజరి,మేడ్చల్ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,నడికొప్పు రంజిత్ ముదిరాజ్,రామన్నగారి రాఘవేందర్ గౌడ్,గోమారం బాల్ రెడ్డి,కనకాల శివ కుమార్ (బిపిటి రాజు),బొక్క రఘుపతి రెడ్డి,దుర్గం వెంకటేష్ ముదిరాజ్,మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ),బండి శ్రీనివాస్ గౌడ్,తొంట యాదయ్య,నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్,పెగుడ శ్యాంరావ్,తొంట సుధాకర్,హనుమంత్ రెడ్డి,దుబ్బ రామస్వామి ముదిరాజ్,భూపాల్ రెడ్డి,రామన్నగారి సంతోష్ గౌడ్,సత్తి రెడ్డి,శివ,రామకృష్ణ,పానుగంటి మహేష్ కుమార్,మహమ్మద్ ఆరిఫ్,విభూది యాదగిరి,చంద్రయ్య గౌడ్,ఆటో విజయ్,లక్ష్మణ్ గౌడ్,మోహన్ రెడ్డి,ప్రభు ముదిరాజ్,శ్రీరాం రెడ్డి,గణేష్,వేముల రంజిత్ రెడ్డి,కటిక వినయ్,మహిళా నాయకురాలు ప్రేమలత,మల్లీశ్వరి, వినోద,శ్యామల,రేణుక,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,నాయకులు, కార్యకర్తలు,యువకులు,మహిళలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై హంస విద్యార్థుల గళం

### - రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాలతో సత్తా



**గజ్వేల్( ప్రశ్న న్యూస్)** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాలని తెలంగాణ ఈగిల్ ఫోర్స్ డీఎస్పీ బి. పుష్పన్ కుమార్ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగ వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్‌లోని హంస హోమియోపతి మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. యువత చట్టాలను గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు.కళాశాల డైరెక్టర్ డా. ఉమేష్ అక్కలదేవి, ములుగు ఎస్ఐ వి. రఘుపతి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, చట్టపరమైన అంశాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.అనంతరం తెలంగాణ ప్రభుత్వ ఈగిల్ ఫోర్స్ విభాగం, ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన హంస హోమియోపతి మెడికల్ కాలేజ్‌కు చెందిన 12 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను బంగారు, రజత, కాంస్య పతకాలతో ఘనంగా సత్కరించారు. విజేతలను ముఖ్య అతిథులు అభినందించి, సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుండాలని పిలుపునిచ్చారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ బాబు కారి మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైతిక విలువలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వైద్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశ్న పత్రాల లీకేజ్ కేరాఫ్‌గా ఎన్డీఏ:టిపిసిసి చీఫ్ మహేష్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ బోయిన్ పల్లి మల్లారెడ్డి గార్డెన్ లో “ఛత్రోంక గూంజ్” కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగావిద్యావ్యవస్థతోపాటు పరీక్ష విధానం పూర్తిగా నిర్వీర్యంగా మారిపోయిందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష ప్రశ్నా పత్రాలు బహిర్గతం కావడం పట్ల కేంద్ర సర్కార్ వైఫల్యాన్ని ఎండగడుతూ ఏఐసిసి ఇచ్చిన పిలుపుమేరకు బోయిన్ పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్ లో ఛత్రోంక గూంజ్ కార్యక్రమం భాగంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరయ్యారు. ఇటీవల నీట్ పరీక్ష ప్రశ్న పత్రాలు లీకైన నేపద్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ వైఖరి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించినట్లు తెలిపారు.నీట్ పరీక్ష పత్రం లీకేజీ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరితో కలిసి కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆగస్టు 1న చలో రాజభవన్ కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ఆగస్టు 9న పార్లమెంటు ముట్టడికి పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి ఢిల్లీకి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.గత పది సంవత్సరాల నుండి దాదాపు 90 కి పైగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో జరిగే వివిధ పరీక్షల పత్రాలు లీకవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరికి నిదర్శనమని,లీకేజీకి బాధ్యులైన వారిపై ఇప్పటికి చర్యలు తీసుకుపోవడం శోచనీయమని బల్మూర్ వేంకట్ అన్నారు.అలాగే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎన్ ఎస్ యు ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వరుణ్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు ఎమ్మెల్సీ,ప్రభుత్వం విప్ బల్మూరి వేంకట్,టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్.

### కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ:

“ఛాంత్రో కి గూంజ్ “ రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశంలోని విద్య వ్యవస్థ పై విద్యార్థుల తరపున గళం వినిపించిన కాంగ్రెస్ పార్టీ అన్నారు.దేశంలోని విద్యా వ్యవస్థలోని లోపాలు,నీట్ పరీక్ష పత్రాల లేకేజీ,విద్యా శాఖ మంత్రి అసమర్ధత, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపు మేరుకు విద్యార్థుల తరపున గొంతు వినిపించడానికి కాంగ్రెస్ పార్టీ బోయిన్ పల్లి లోని మల్లారెడ్డి గార్డెన్స్ లో “ఛాంత్రో కి గూంజ్” కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వం దేశంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని,విద్యా వ్యవస్థపై చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. దేశంలో విద్యా వ్యవస్థను పైవేట్ వాళ్ల చేతుల్లో పెట్టారని ప్రభుత్వ విద్యను నాశనం చేస్తూ పేదలకు చదువును దూరం చేస్తుందని విమర్శించారు.

నీట్ ప్రశ్నాపత్రం లీక్ ద్వారా ఎంతో మంది విద్యార్థుల చావుకు కారణమైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ జాన్,పలువురు కార్పోరేషన్ల ఛైర్మన్ లు,కాంగ్రెస్ నాయకులు,పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జూలై 18న ఛలో యువ సంగ్రామ సదస్సు

### - నిరుద్యోగ డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం
### - ఎస్ ఐ ఆర్ అంశంలో అప్రమత్తంగా ఉండండి
### - శాసన సభ్యులు గూడెం



**పటాన్చెరు ( ప్రశ్న న్యూస్ )** ఎన్నికల ముందు యువజన ప్రకటనలో (నిరుద్యోగ డిక్లరేషన్) నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్చెరు నియోజకవర్గం నుండి 5 వేల మంది యువత హాజరుకానునట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సరూర్ నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామంటూ నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న..నేటికి యువజన సంక్షేమంపై ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి, ఉద్యోగ ప్రకటనలు జారీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆయన ఆరోపించారు. నిరుద్యోగ యువతను, రైతులను, మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని పేర్కొంటూ, ఈ యువజన సమావేశం ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతుందని ఆయన అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నియామకాలలో జాప్యం చేయడం ద్వారా ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగ యువతను నమ్మించి గొంతు కోసిందని విమర్శించారు. పటాన్చెరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, డివిజన్లు, గ్రామాల నుండి ఐదు వేల మంది యువత సదస్సుకు హాజరు కాబోతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.సర్ పై అప్రమత్తంగా ఉండండి..ప్రజలకు మరింతగా అవగాహన కల్పించండి..కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అంశంలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తులు నింపని అర్హులైన ప్రతి ఓటర్ని కలిసి.. దరఖాస్తులు నింపేలా చైతన్యం తీసుకుని రావాలని కోరారు. ఎస్ ఐ ఆర్ అంశంలో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు అభివృద్ధికి ఓటు హక్కు అత్యంత కీలకమని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ ప్రహరీ గోడకు అక్రమంగా గేటు ఏర్పాటుపై వివాదం


### - పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు
### - గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఆవరణలో అక్రమంగా ఏర్పాటు చేసిన గేటు కలకలం సృష్టించింది. గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా గేటు ఏర్పాటు చేయడంపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జాయింట్ సబ్ రిజిస్ట్రర్ వి రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అక్రమంగా గేటు ఏర్పాటు చేయడం నేరమని వీరిపై బిఎన్ఎస్ సెక్షన్లు 329 (3) 3 24 (4) రెడ్ విత్ 3(5) కింద క్రైమ్ నెంబర్ 692/2026 ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### వివరాలు ఇలా ఉన్నాయి

ఇంత కాలం అద్దె భవనంలో ఉన్న జిల్లా రిజిస్ట్రర్ కార్యాలయం ఇటీవల సొంత భవనంలోకి వచ్చింది. అయితే ఈ నెల 23న జిల్లా రిజిస్ట్రర్ కార్యాలయ ప్రహరీ గోడను కూల్చి అక్రమంగా గేటును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. అదే రోజు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో గేటును ఏర్పాటు చేయడం కలకలం



సృష్టించింది. దీంతో జిల్లా రిజిస్ట్రర్ కార్యాలయ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తులపై మేడ్చల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది.

# మానవత్వానికి చేయూత

### - రోగులకు పండ్లు, మానసిక వికలాంగుల విద్యార్థులకు భరోసా
### - ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం..
### - ఆసుపత్రి, పాఠశాల సమస్యల పరిష్కారానికి హామీ
### - అధ్యక్షురాలు షమీం ఉపాధ్యక్షురాలు రజియా బేగం



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సమాజ సేవే ధ్యేయంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం మానసిక వికలాంగుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ మహమ్మద్ అజర్, జిల్లా అధ్యక్షురాలు



షమీం, జిల్లా ఉపాధ్యక్షురాలు రజియా బేగం పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం స్పందించి ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలను తక్షణమే కల్పించాలని కోరారు.అనంతరం మానసిక వికలాంగుల పాఠశాలను సందర్శించిన ప్రతినిధులు విద్యార్థులతో మాట్లాడి, అక్కడి సమస్యలను పరిశీలించారు. ప్రభుత్వంతో పాటు తమ సంస్థ తరఫున కూడా దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.మహిళలు, విద్యార్థినులపై ఎలాంటి వేధింపులు జరిగినా వెంటనే ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థను సంప్రదించాలని సూచించారు. బాధితులకు అండగా నిలిచి, సమస్యల పరిష్కారానికి తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విమల, ఆర్. సంధ్యారాణి, ఖాజా బాబా, మస్యుద్దీన్, రసూల్ బాబా , జుబేర్, అబ్దుల్, హకీం, సరూప, యాదమ్మ, వెంకటలక్ష్మి, లలితతో పాటు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభానికి ప్రభుత్వ తరపున ఘన నివాళి

**- కిర్లంపూడిలో పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన: మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్**



**అమరావతి(ప్రశ్న న్యూస్)** మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు ముద్రగడ పద్మనాభం మృతిపట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్ కాకినాడ జిల్లా కిర్లంపూడికి వెళ్లి ముద్రగడ పద్మనాభం పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ముద్రగడ నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను కలిసి మంత్రులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ముద్రగడ పద్మనాభం రాష్ట్ర రాజకీయాల్లో విశిష్టమైన ముద్ర వేసిన నాయకుడని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రులు పేర్కొన్నారు. ఆయన మరణం రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అభిమానులు కూడా ముద్రగడ పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## శవాలపై రాజకీయాలు మానుకోవాలి

**- జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు**



గుంటూరు(ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శల పేరుతో శవాలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఆరోపించారు. గుంటూరులోని జనసేన జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అకాల మరణం బాధాకరమని పేర్కొన్న గాదె, జనసేన పార్టీ తరఫున ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అయితే ఎక్కడ మరణం జరిగినా అక్కడికి వెళ్లి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని వైఎస్ జగన్‌పై విమర్శలు గుప్పించారు.మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే ముందు ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాలనలో వారికి ఏం చేశారో జగన్ ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాల్లో మరణించిన మత్స్యకార కుటుంబాలకు గత ప్రభుత్వం ఎంత పరిహారం ఇచ్చిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు బీమా సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు.ఈ సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శిఖా బాలు, మిర్చి యార్డ్ డైరెక్టర్ నక్కల వంశీకృష్ణ, జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, నగర ఉపాధ్యక్షులు కొండూరు కిషోర్, తిరుమలశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సహకార బ్యాంకుల పాలక మండళ్ల నియామకాలపై కాంగ్రెస్ కసరత్తు




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** సహకార బ్యాంకుల పాలక మండల్ల నియామకాలపై కాంగ్రెస్ కసరత్తులు ప్రారంభించింది. ఇందులో భాగంగా మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలోని కిష్టాపూర్ డివిజన్, అత్వెల్లిలోని జీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సహకార బ్యాంకుల పాలక మండళ్ల ఏర్పాటుకు సంబంధించి ముఖ్య సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం సహకార బ్యాంకులకు చైర్మన్‌లు, డైరెక్టర్లను నామినేటెడ్ విధానంలో నియమిస్తూ పాలక మండళ్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సహకార బ్యాంకులకు పాలక మండళ్ల ఏర్పాటు ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా పాలక మండళ్లలో చైర్మన్, డైరెక్టర్ పదవులను ఆశిస్తున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు, పేర్లను స్వీకరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సమావేశానికి పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట్ల విజయరమణరావు, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మెన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి ,జిల్లా ఓబీసీ ఛైర్మెన్ రవి ముదిరాజ్, ఆర్టిఏ మెంబెర్ జైపాల్ రెడ్డి,డీసీసీ ఉపాధ్యాక్షులు వేముల మహేష్ గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శిరీష రెడ్డి,బాలు రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి సత్యనారాయణ, డిసిసి ప్రధాన కార్యదర్శి బీపీటీ రాజు, కిష్టాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చాపరాజు, గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, ఎల్లంపేట మున్సిపాలిటీ అధ్యక్షుడు విగ్నేశ్వర రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం డివిజన్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు,డివిజన్ నాయకులు, సహకార సంఘాల ప్రతినిధులు, పదవులు ఆశిస్తున్న అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# “హనీ ట్రాప్”పై నజర్,అరెస్టు, రిమాండ్:డిసిపి శ్రీధర్




**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** జంటనగరాల్లో రకరకాల నేరాలు జరుగుతున్నాయి. సామాన్యుల వ్యక్తి గత విషయాలు ఆరా తీసి”సూడో పోలీస్”అవతారం ఎత్తి అందిన కాడికి దోచుకెళ్తున్న కేటుగాళ్లని అరెస్టు చేసి రిమాండ్ తరలించిన అల్వాల్ పోలీసులు.అసలు విషయం ఏమిటంటే”హనీ-ట్రాప్,నకిలీ పోలీసు కిడ్నాప్,దోపిడీ, బెదిరింపుల”కేసును అల్వాల్ పోలీసులు ఛేధించారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.మల్కాజ్‌గిరి కమిషనరేట్‌లోని అల్వాల్ పోలీసులు హనీట్రాప్,(సూడో) పోలీసు అధికారుల వేషధారణ,కిడ్నాప్,అక్రమ నిర్బంధం,దోపిడీ,దొంగతనం, ఆయుధాల అక్రమ వినియోగం వంటి సంచలనాత్మక కేసును ఛాలేంజ్ గా తీసుకుని విజయవంతంగా ఛేదించి “5”నిందితులను అరెస్టు చేశారు.వ్యాపారవేత్త గర్లపాటి వెంకట దుర్గ నాగేశ్వర సిద్ధార్థ (40 సంవత్సరాలు) అనే బాధితుడిని, 14.11.2025న మచ్చబొల్లారంలోని ఐస్ ఫ్యాక్టరీ వ్యాపారం నిర్వహిస్తున్నారు.పోలీసుల మంటూ ఆయనను అడ్డగించి కిడ్నాప్ చేశారు.అల్వాల్ పోలీసుల విచారణలో తేలిందేమిటంటే,నాగరాజు రఘు వర్మ, ఏ2 సునీల్,ఫౌజీ సునీల్ కుమార్,ఏ3 రింకు రికీ సంధు రిక్కీ,ఏ4 మోహిత్, కిర్షాద్, ఏ5 రాజేష్ సర్పంచ్ జైవీర్ సింగ్‌లతో కలిసి, పోలీసు విచారణ నెపంతో బాధితుడిని స్కార్పియో వాహనంలో అపహరించి నట్లు అలాగే నిందితులు బాధితుడిని తుపాకీతో బెదిరించి,అతనిపై దాడి చేసి, సుమారు 98.3 గ్రాముల (10 తులాల) బంగారు ఆభరణాలు,డెల్ ల్యాప్‌టాప్, వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను దోచుకున్నారు.నిందితుడు తదనంతరం బాధితుడి కుటుంబ సభ్యుల నుండి 18 లక్షలు బలవంతంగా వసూలు చేసి పోలీసులకు సమాచారం ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించిన తర్వాత ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దులోని బెర్హంపూర్ అటవీ ప్రాంతంలో అతడిని వదిలిపెట్టి వెళ్ళిపోతూ అతనికి దారి ఖర్చుల కోసం ఐదు వేల రూపాయలు ఇచ్చారు.వీసా ప్రాసెసింగ్‌లో సహాయం చేస్తామని తప్పుడు సాకుతో బాధితురాలిని ప్రలోభపెట్టిన ఏ6 తోటకూరి గోపీ కృష్ణ అలియాస్ గోపీ, ఏ7 చటారి మాధవి అలియాస్ మధుల ప్రమేయం ఉందని తర్వాత విచారణలో రుజువైంది.వారు బాధితురాలి కదలికలు, వ్యక్తిగత వివరాలను ప్రధాన నిందితుడితోపంచుకున్నారు, తద్వారా ఈ నేరం జరగడానికి వీలు కల్పించారు.ఇద్దరు నిందితులను 23.06.2026న అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.నాగరాజు రఘు వర్మను ఇంతకుముందు జగద్గిరిగుట్ట పోలీసులు మరో కేసులో అరెస్టు చేయగా, అతను అప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా,డిఐ అల్వాల్ కె.వీరబాబు,డిఎస్ఐ చంద్ర శేఖర్ దర్యాప్తు బృందంతో కలిసి హర్యానా,చండీగఢ్‌లలో విస్తృతమైన అంతర్రాష్ట్ర ఆపరేషన్లు నిర్వహించారు.దీని ఫలితంగా పరారీలో ఉన్న నిందితులను:ఏ2 సునీల్ ఫౌజీ అలియాస్ సునీల్ కుమార్ (38 సంవత్సరాలు) చండీగఢ్/కురుక్షేత్ర నివాసి.ఏ3 రింకు రికీ సంధు అలియాస్ రిక్కీ(40 సంవత్సరాలు) కురుక్షేత్ర, హర్యానా.హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ఏ5 రాజేష్ సర్పంచ్ అలియాస్ జైవిర్ సింగ్ (40 సంవత్సరాలు)హర్యానా.వీరివద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నవి:3.5 తులాల బంగారు ఆభరణాలు.3.8 లక్షల నగదు.మొబైల్ ఫోన్లు మూడు.మిగిలిన చోరీ సొత్తు ని స్వాధీనం చేసుకోవడానికిపరారీలో నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.మల్కాజ్‌గిరి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సి.హెచ్.శ్రీధర్, మల్కాజ్‌గిరి అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.రామ్ కుమార్, బేగంపేట్ డివిజన్ ఏసీపీ.పి. గోపాల కృష్ణమూర్తి,డి.ఐ.కె. వీరబాబు,ఎస్ఐ చంద్రశేఖర్ దర్యాప్తు బృందాన్ని డిసిపి అభినందించారు.

# ఎరువులు, విత్తనాల కొరతతో అప్పుల ఊబిలో ములుగు రైతులు

**- ఖరీఫ్ సీజన్‌లో కష్టాలు..**

**- సబ్సిడీపై నాణ్యమైన సరుకులు, రుణమాఫీ డిమాండ్**



**ములుగు(ప్రశ్న న్యూస్)** జిల్లాలో తొలకరి జల్లులతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. పొలాల్లో సేద్యపు హడావుడి కనిపిస్తున్నప్పటికీ రైతాంగం మాత్రం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. సకాలంలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందక, బ్యాంకు రుణాలు రాక, గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

### రెట్టింపు ధరలకు ఎరువుల విక్రయం..

ఈ సీజన్‌లో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న స్టాక్‌ను కూడా వ్యాపారులు రెట్టింపు ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో నాణ్యత లేని విత్తనాలు ఎక్కువగా ఉన్నాయని, సరైన గుర్తింపు లేని విత్తనాలు కొని చేతులు కాల్చుకుంటున్నామని వాపోయారు. దీంతో పెట్టుబడి భారం గణనీయంగా పెరిగిపోయిందని తెలిపారు.

### బ్యాంకు రుణాలు రాక ప్రైవేట్ అప్పులు..

ఇప్పటికే అప్పుల్లో ఉన్న రైతులకు బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలు మంజూరు కావడం లేదు. దీంతో అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోంది. పండించిన పంటకు మద్దతు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదు. ఫలితంగా “వ్యవసాయమే దండగ” అనే నిరాశలో కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

### ప్రభుత్వం వెంటనే స్పందించాలి: పల్లబోయిన స్వామి

ఈ సందర్భంగా తెలంగాణ రైతు కూలీ సంఘం ములుగు జిల్లా కార్యదర్శి పల్లెబోయిన స్వామి మాట్లాడుతూ, ఖరీఫ్ దృష్ట్యా ప్రతి రైతుకు సకాలంలో సబ్సిడీపై నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పించాలని, పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని కోరారు. రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.చిన్న, సన్నకారు రైతులకు రెవెన్యూ శాఖ అధికారులు పహనీల నకళ్లను ఉచితంగా వెంటనే అందించాలని సూచించారు.

ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోకపోతే రైతు సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కావేరి దిలీప్, కన్నాయి గూడెం మండల కమిటీ సభ్యుడు కావేరి సూరయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు కావేరి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ఇండస్ట్రియల్ ఫార్మసీ

**- ఎం.ఫార్మ్. కోర్సు 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం**

GITAM
DEEMED TO BE UNIVERSITY

**పటాన్‌చెరు (ప్రశ్న న్యూస్ )** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ ఫార్మసీ 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఇండస్ట్రియల్ ఫార్మసీలో ఎం.ఫార్మ్. కోర్సును ప్రారంభించడానికి భారత ఫార్మసీ కౌన్సిల్ (పీసీఐ) ఆమోదించింది. దీనితో పోస్టు గ్రాడ్యుయేట్ విద్య మరింత బలోపేతం కావడంతో పాటు, ఫార్మసీ వృత్తి నిపుణులు కావాలనుకునే వారికి అవకాశాలు కూడా విస్తరిస్తున్నాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ మంగళవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.ఈ చేర్పుతో, స్కూల్ ఆఫ్ ఫార్మసీ నాలుగేళ్ల బి.ఫార్మ్ కోర్సుతో పాటు ఇండస్ట్రియల్ ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మాస్యూటిక్స్ అనే మూడు పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తోందని తెలియజేశారు. ఈ కొత్త కోర్సు, ఫార్మాస్యూటికల్ తయారీ, నాణ్యత హామీ, నియంత్రణ వ్యవహారాలు, పారిశ్రామిక పరిశోధన రంగాలలో విద్యార్థులకు ఉన్నత పరిజ్ఞానం, పరిశ్రమ-ఆధారిత నైపుణ్యాలను అందించేలా రూపొందించామన్నారు.స్కూల్ ఆఫ్ ఫార్మసీ నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా తన విద్యాపరమైన ఖ్యాతిని నిరంతరం బలోపేతం చేసుకుంటోందని తెలిపారు. తన విద్యాపరమైన స్థాయిని మరింత పటిష్టం చేస్తూ, ఈ స్కూల్ ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్ లో ఫార్మసీ విభాగంలో 33వ ర్యాంకును పొందిందన్నారు.ఫార్మసీ ప్రిన్సిపాల్ గా తన నేతృత్వంలో, ఈ స్కూల్ అనేక ముఖ్యమైన మైలురాళ్లను సాధించినట్టు ప్రొఫెసర్ శివకుమార్ తెలియజేశారు. అధ్యాపక బృందం పరిశోధన, ఆవిష్కరణ, ఫార్మసీ విద్యలో వారి నైపుణ్యానికి గాను ప్రతిష్టాత్మక అవార్డులు, పేటెంట్లు, జాతీయ, అంతర్జాతీయ గుర్తింపులను కూడా అందుకున్నట్టు ఆయన వివరించారు.ఫార్మసీ స్కూల్ ఔషధ ఆవిష్కరణ, న్యూరోడీజెనరేటివ్, క్యాన్సర్ చికిత్సలు, అధునాతన ఔషధ పంపిణీ వ్యవస్థలు, నానోథెరనోస్టిక్స్, త్రీడీ ప్రింటింగ్, సస్టెయిన్డ్-రిలీజ్ ఫార్ములేషన్స్ వంటి రంగాలలో గణనీయమైన కృషి చేసి, ఒక శక్తివంతమైన పరిశోధనా కేంద్రంగా కూడా ఆవిర్భవించిందన్నారు. అధిక ప్రభావం చూపే జర్నల్స్ లో ఈ స్కూల్ ప్రచురణల రికార్డు నిరంతరం పెరుగుతూ ఉండటం, అత్యాధునిక ఫార్మాస్యూటికల్ పరిశోధన, ప్రపంచ విద్యా నైపుణ్యం పట్ల తమ సంస్థ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రొఫెసర్ శివకుమార్ వివరించారు.ఇండస్ట్రియల్ ఫార్మసీలో ఎం.ఫార్మ్ కోర్సును ప్రవేశపెట్టడం అనేది, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ యొక్క మారుతున్న అవసరాలను తీరుస్తూనే, పరిశోధన, ఆవిష్కరణ, ఆరోగ్య సంరక్షణకు దోహదపడే అత్యంత నైపుణ్యం గల ఫార్మసీ నిపుణులను తయారు చేయాలనే గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు.

## మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తుకు నష్టం

**- డ్రగ్స్ నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలి**

**- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు**




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మాదక ద్రవ్యాల వ్యసనం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని శారీరక, మానసిక సమస్యలకు గురిచేస్తుందని డ్రగ్స్ నివారించడానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్య నిర్మూలన సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని అందులో భాగంగా సంక్షేమ శాఖల అధికారులు ప్రతి నెల బాలుర హాస్టల్స్ లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై వైద్య శాఖ వారు తగినవిధంగా అవగాహన కల్పించాలని అవసరమైన మేరకు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. డ్రగ్స్ వాడకం తో కలిగే మానసిక, శారీరక సమస్యల పై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. పోలీసు శాఖ వారు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, సున్నితమైన ప్రదేశాలలో సమర్థవంతమైన నిఘాతో డ్రగ్స్ నిర్మూలనకు చ్యరలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో, కాలేజీల పై ప్రత్యేక నిఘాతో పర్యవేక్షించాలన్నారు. సంబంధిత శాఖల వారు ప్రణాళిక కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నిర్వహించిన కార్యక్రమాల వివరాలను తమకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా ను ముందుంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పద్మజా, డ్రగ్ ఇన్స్పెక్టర్ మౌనిక, అడిషనల్ డిసిపిలు కుత్బుల్లాపూర్ పురుషోత్తం, కూకట్ పల్లి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల పోషకాహారానికి
# సాంకేతిక చేయూత

- పలాసలో 365 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు, వంట పాత్రల పంపిణీ.
- పరిశుభ్రమైన ఆహారమే ప్రభుత్వ లక్ష్యమన్న ఎమ్మెల్యే గౌతు శిరీష




**పలాస(ప్రశ్న న్యూస్)** చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే బలమైన పునాదులని, అక్కడ అందించే పోషకాహారం నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో పలాస నియోజకవర్గంలోని అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు, వంట పాత్రల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష స్వయంగా లబ్ధిదారులకు ఇండక్షన్ స్టవ్లు, వంట పాత్రలను అందజేశారు.కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే గౌతు శిరీష, అంగన్వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం పంపిణీ కేంద్రాలు మాత్రమే కాదని, భావితరాల ఆరోగ్యం, విద్య, మానసిక వికాసానికి పునాదులు వేసే కేంద్రాలని అన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అన్ని అంగన్వాడీ కేంద్రాలకు కల్పిస్తున్నామని చెప్పారు.ఇప్పటి వరకు చాలా కేంద్రాల్లో సంప్రదాయ వంట విధానాల వల్ల కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ఇండక్షన్ స్టవ్లు అందుబాటులోకి రావడంతో వంట ప్రక్రియ వేగవంతంగా, పరిశుభ్రంగా, సురక్షితంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పొగ సమస్య తగ్గడంతో పాటు వంట సమయం కూడా ఆదా అవుతుందని, దీనివల్ల చిన్నారులకు నిర్ణీత సమయంలో వేడి, తాజా ఆహారం అందించడానికి వీలవుతుందని తెలిపారు.

# దొనకొండ చెరువులకు మహర్దశ

- గుండ్లకమ్మ జలాలతో సాగుకు కొత్త ఊపు
- రూ.100 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదనలు
- చెరువుల పూడికతీతతో కరువుకు చెక్: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**ఒంగోలు(ప్రశ్న న్యూస్)** దొనకొండ ప్రాంతాన్ని కరువురహితంగా మార్చి వ్యవసాయాభివృద్ధికి కొత్త దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో బుధవారం జరిగిన ప్రకాశం జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశంలో ఆమె పాల్గొని దొనకొండ, దర్శి నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గుండ్లకమ్మ జలాలను వినియోగించుకునేందుకు రూ.100 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం, ఉద్యానవన శాఖ, నటుడు నానా పటేకర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చెరువుల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు.దొనకొండ మండలంలో ఉన్న 46 చెరువుల పూడికతీత, అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే రూ.66 లక్షల వ్యయంతో రుద్రసముద్రం, పుల్లాయపాలెం గ్రామాల్లో చెరువుల పూడికతీత పనులు ప్రారంభించినట్లు వివరించారు.దొనకొండ పారిశ్రామికాభివృద్ధికి, తాగునీటి సమస్య పరిష్కారానికి, డీఆర్‌డీఏ ప్రాజెక్టుకు అవసరమైన నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ నెల 23న జిల్లా కలెక్టర్ దొనకొండలో ప్రతిపాదిత లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాంతాలు, చెరువులను సందర్శించి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు.వెనుకబడిన ప్రాంతాలకు ఉద్యానవన శాఖ అందించే సబ్సిడీ పథకాలను దొనకొండకు కూడా వర్తింపజేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి సమస్య, రైతులకు అవసరమైన ప్రభుత్వ సహాయం, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల మరమ్మతులు వంటి అంశాలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.అదేవిధంగా దర్శి నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను సమావేశంలో ప్రస్తావించగా, అధికారుల నుంచి సానుకూల స్పందన లభించిందని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, వివిధ సంస్థల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

## సత్తెనపల్లిలో అధికారులతో సమీక్ష
## నిర్వహించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



**సత్తెనపల్లి(ప్రశ్న న్యూస్)** ఈ నెల 17న నరసరావుపేటకు కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సత్తెనపల్లిలో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ ప్రజావేదికలో జరిగిన ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని అధికారులతో పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, సభా ప్రాంగణంలో మౌలిక వసతులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, క్లస్టర్, గ్రామ స్థాయి కూటమి పార్టీ నాయకులు, అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్లేట్ కోసం పోటీ... ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు

- రెస్టారెంట్ ముందు రోడ్డే పార్కింగ్ స్థలమా.?- గౌతమబుద్ధ రోడ్డుపై నిత్యం నరకయాతన
- చూస్తూ ఊరుకుంటున్న అధికారులపై ప్రజల ఆగ్రహం



**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** మంగళగిరి పట్టణంలోని ఆటోనగర్ పరిధిలో గౌతమబుద్ధ రోడ్డుపై రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. జనసేన పార్టీ పాత కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ ప్రముఖ రెస్టారెంట్ వద్ద వాహనదారులు తమ కార్లు, బైకులను ఇష్టానుసారంగా రహదారిపైనే నిలిపివేయడం వల్ల రోడ్డులో సగానికి పైగా భాగం ఆక్రమణకు గురవుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇప్పటికే వెడల్పు తక్కువగా ఉన్న గౌతమబుద్ధ రోడ్డుపై రెండు వైపులా వాహనాలు నిలిపివేయడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు దాటుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో రెస్టారెంట్‌కు వచ్చే వినియోగదారుల సంఖ్య పెరగడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. చిన్న వాహనాలే కాదు, కార్లు కూడా రోడ్డుపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, ఈ సమస్య కొత్తది కాదు. నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఈ మార్గంలో తరచూ సంచరించినా, నిబంధనలను ఉల్లంఘిస్తూ నిలిపే వాహనాలపై చర్యలు తీసుకోకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు ఈ రహదారినే ప్రధానంగా వినియోగిస్తుంటారు. ట్రాఫిక్ కారణంగా ప్రతిరోజూ విలువైన సమయం వృథా అవుతుండటంతో పాటు ప్రమాదాల భయం కూడా వెంటాడుతోంది. ఎదురెదురుగా వచ్చే భారీ వాహనాలు దాటుకునే సమయంలో ద్విచక్రవాహనదారులు పక్కకు తప్పుకునే పరిస్థితి లేక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.అత్యవసర సేవలకు చెందిన అంబులెన్స్లు, అగ్నిమాపక వాహనాలు ఈ మార్గంలో వెళ్లాల్సి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. ట్రాఫిక్ జామ్ కారణంగా అత్యవసర సేవలకు ఆటంకం కలిగితే దాని బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.నగరాభివృద్ధి అంటే కేవలం కొత్త భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. రహదారులను ఆక్రమణల నుంచి కాపాడటం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని కల్పించడం కూడా అధికారుల ప్రధాన బాధ్యతే.

అయితే ఈ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆ బాధ్యతను అధికారులు విస్మరించినట్లు కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.వ్యాపార సంస్థలకు వినియోగదారులు రావడం సహజమే. కానీ వారి వాహనాలు ప్రజా రహదారులపై అడ్డంగా నిలిపివేయడం చట్టవిరుద్ధం. వాణిజ్య సంస్థలు తమ వినియోగదారుల కోసం పార్కింగ్ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత కూడా ఉందని ట్రాఫిక్ నిపుణులు సూచిస్తున్నారు. ఆ బాధ్యతను విస్మరించి ప్రజా రహదారులనే పార్కింగ్ స్థలాలుగా మార్చడం వల్ల ప్రజలే ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యపై ఇప్పటికే పలువురు స్థానికులు సంబంధిత అధికారులకు మౌఖికంగా ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించలేదని చెబుతున్నారు. అప్పుడప్పుడు ట్రాఫిక్ సిబ్బంది వచ్చి వాహనాలను తొలగించినా, కొద్దిసేపటికే మళ్లీ అదే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. గౌతమబుద్ధ రోడ్డుపై వెంటనే "నో పార్కింగ్" బోర్డులు ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించి రహదారిపై వాహనాలు నిలిపే వారిపై జరిమానాలు విధించాలి. అవసరమైతే టోయింగ్ వాహనాలతో అక్రమంగా నిలిపిన వాహనాలను తరలించాలి. రెస్టారెంట్ యాజమాన్యానికి కూడా పార్కింగ్ నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.పట్టణం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. అలాంటి సమయంలో అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోకపోతే చిన్న సమస్యలు పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంది. ట్రాఫిక్ క్రమశిక్షణ అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, వాహనదారులు, వ్యాపార సంస్థలు, స్థానిక సంస్థలు అందరూ కలిసి పాటించాల్సిన సామాజిక బాధ్యత.గౌతమబుద్ధ రోడ్డుపై నెలకొన్న ఈ పరిస్థితి మంగళగిరి పట్టణ ట్రాఫిక్ నిర్వహణలో ఉన్న లోపాలను స్పష్టంగా బయటపెడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రహదారులపై అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నియంత్రిస్తేనే ప్రజలకు ఉపశమనం లభిస్తుంది. లేకపోతే "రోడ్డు ప్రజలదా... లేక పార్కింగ్ కోసం వచ్చేవారిదా?" అనే ప్రశ్న మరింత బలంగా వినిపించే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఓటే ప్రజాస్వామ్యానికి బలమైన ఆయుధం

- ఎస్ఐఆర్‌లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ--పీజేఆర్ నగర్ కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని డీసీ చాముండేశ్వరి, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, సంతకం చేసి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. కేవలం ఫారం తీసుకోవడం సరిపోదని, తిరిగి బీఎల్ఓకు సమర్పించినప్పుడే ఓటరు నమోదవుతారని స్పష్టం చేశారు.జూలై 24 చివరి తేదీ కావడంతో ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. ఫారం సమర్పించిన తర్వాత తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ (రసీదు) తీసుకుని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి సేవలందిస్తున్నారని, అయితే హైరైజ్ భవనాలు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల్లోకి ప్రవేశానికి అనుమతి లేకపోవడం, ఫారాలు ఆలస్యంగా అందడం వంటి కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఓటు హక్కు కోల్పోతే భవిష్యత్తులో అనేక పరిపాలనా, పౌర సేవల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రతి కుటుంబం తమ ఓటు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి



**గుంటూరు(ప్రశ్న న్యూస్)** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్లా మాధవి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు.నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలు, ప్రజా సమస్యలు, పార్టీ సంస్థాగత బలోపేతానికి సంబంధించిన పలు సూచనలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కో వినతిని శ్రద్ధగా విన్న గళ్లా మాధవి, సంబంధిత అంశాలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కార్యకర్తల సూచనలకు కూడా సముచిత ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా 'యేరువ జగదీశ్వరి కోటిరెడ్డి మెమోరియల్ స్కాలర్‌షిప్‌లు'

- సజ్జల రామకృష్ణారెడ్డి, బలసాని కిరణ్ కుమార్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ




**గుంటూరు(ప్రశ్న న్యూస్)** పేద విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన యేరువ జగదీశ్వరి కోటిరెడ్డి మెమోరియల్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం గుంటూరు అర్బన్ మండలం పెద్ద పలకలూరులో బుధవారం ఘనంగా జరిగింది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలూరి వెంకటరెడ్డి ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అర్హులైన పేద విద్యార్థులకు యేరువ జగదీశ్వరి కోటిరెడ్డి మెమోరియల్ స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో విలువైనదని, ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకిగా మారకుండా ఇటువంటి స్కాలర్‌షిప్‌లు ఎంతో దోహదపడతాయని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు, పరిశీలకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మార్కాపురం అభివృద్ధి అంశాలపై
# డీఆర్సీలో ఎమ్మెల్యే కందుల గళం

- హార్టికల్చర్ హబ్ ఫేజ్-1లో అన్ని మండలాలకు చోటు కల్పించాలని విజ్ఞప్తి




**ఒంగోలు(ప్రశ్న న్యూస్)** ప్రకాశం, మార్కాపురం జిల్లాల ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్ష (డీఆర్సీ) సమావేశంలో మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సమస్యలను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పలువురు ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ, మార్కాపురం జిల్లాను రాయలసీమ జిల్లాలతో కలిపి హార్టికల్చర్ హబ్‌గా ప్రకటించడం స్వాగతార్హమని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే జిల్లాలోని అన్ని మండలాలను హార్టికల్చర్ హబ్ ఫేజ్-1లో చేర్చాలని కోరారు.నియోజకవర్గంలోని సోషల్ ఫారెస్ట్ విభాగం ప్రస్తుతం ఒంగోలు డివిజన్ పరిధిలో ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దానిని మార్కాపురం డివిజన్ పరిధిలోకి మార్చాలని సూచించారు. చెరువుల్లో పేరుకుపోయిన కంప చెట్ల తొలగింపు, పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కూడా సమావేశంలో కోరారు.మార్కాపురం అభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు సమస్యలపై చర్చించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు హామీ ఇచ్చారు.

## ఆంధ్ర క్రికెట్‌కు కొత్త దిశగా కళ్యాణ్ కృష్ణ..

## దేశంలో నంబర్-1 లక్ష్యంగా ఏసీఏ అడుగులు



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా మాజీ ఐపీఎల్ ఆటగాడు, ఆంధ్ర జట్టు మాజీ క్రికెటర్ దొడ్డపనేని కళ్యాణ్ కృష్ణ బుధవారం విజయవాడలోని ఏసీఏ పరిపాలనా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్ర క్రికెట్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టడం, రాష్ట్రం నుంచి మరింత మంది ఆటగాళ్లు ఐపీఎల్‌తో పాటు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కళ్యాణ్ కృష్ణ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్ బాబు, ట్రెజరర్ దండమూడి శ్రీనివాస్లకు కృతజ్ఞతలు తెలిపారు. 2001 నుంచి 2011 వరకు ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తనకు, 2008-09 ఐపీఎల్ ప్రారంభ సీజన్లలో ఆడిన అనుభవంతో పాటు దులీప్ ట్రోఫీ, దియోధర్ ట్రోఫీల్లో ఆరు సీజన్లు ఆడిన అనుభవం ఉందన్నారు. గతంలో ఆంధ్ర జట్టుకు బౌలింగ్ కోచ్‌గా సేవలందించడంతో పాటు, 2015 నుంచి జియో హాట్‌స్టార్, సోనీ నెట్‌వర్క్‌లలో క్రికెట్ వ్యాఖ్యాతగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇప్పుడు మరోసారి ఆంధ్ర క్రికెట్ అభివృద్ధికి సేవలందించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను గుర్తించి, వారికి అత్యున్నత స్థాయి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు.

### ఆటగాళ్ల అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి

గేమ్ డెవలప్‌మెంట్, ఆటగాళ్ల ఎంపిక విధానం, కోచింగ్ ప్రమాణాలు, శిక్షణా సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కళ్యాణ్ కృష్ణ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఏపీఎల్ (ఆంధ్ర ప్రీమియర్ లీగ్) విజయవంతంగా సాగిందని, ఆ టోర్నీలో యువ ఆటగాళ్లు అసాధారణ ప్రతిభ కనబర్చారని అన్నారు.

ఏసీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధునిక స్టేడియాలు, మెరుగైన సౌకర్యాలు, సమర్థవంతమైన నిర్వహణ కారణంగా ఏపీఎల్ ఐపీఎల్‌కు ఏమాత్రం తీసిపోకుండా విజయవంతమైందని పేర్కొన్నారు. ఇలాంటి లీగ్‌లు నిరంతరం నిర్వహిస్తే రాష్ట్రం నుంచి మరింత మంది ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి వస్తారని అభిప్రాయపడ్డారు.సీనియర్, జూనియర్ జట్లను మరింత బలోపేతం చేసి, ఆంధ్ర క్రికెట్‌ను దేశంలోనే అత్యుత్తమ జట్లలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తామని కళ్యాణ్ కృష్ణ తెలిపారు. తనకు మరోసారి ఈ అవకాశాన్ని కల్పించిన ఏసీఏ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## చెత్తరహిత ఏపీ' లక్ష్యంగా వేగం

- జూలై నెలాఖరుకల్లా లెగసీ వ్యర్థాలకు పూర్తిగా తెర -- మంత్రి నారాయణ
- గత పాలకులకు విజన్ లేకపోవడంతో ఘన వ్యర్థాల సమస్య పెరిగింది... రాష్ట్రవ్యాప్తంగా 107 ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణం



**నెల్లూరు(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రమైన, చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన లెగసీ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణలో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు రూరల్ మండలంలోని దొంతాళి డంపింగ్ యార్డును సందర్శించిన మంత్రి నారాయణ అక్కడ నిర్మాణంలో ఉన్న ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చడం ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజలపై చెత్త పన్ను భారం మోపడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 153 లక్షల టన్నుల లెగసీ చెత్త పేరుకుపోయే పరిస్థితిని తీసుకొచ్చిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత కేవలం రెండేళ్లలోనే 130 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించామని, మిగిలిన 23 లక్షల టన్నుల వ్యర్థాల ప్రాసెసింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈ వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మహేష్, అదనపు కమిషనర్ హిమబిందు, ఎస్ఈ జానీ, జిందాల్ కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, జిగ్మా కంపెనీ ప్రతినిధులు, టీడీపీ నాయకుడు దొడ్డపనేని రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు టీటీడీ పట్టాభిషేకం

- 147 మంది విద్యార్థులకు 'ప్రతిభా పురస్కారం--2026' ప్రదానం
- విద్య, ఆరోగ్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యం...
- టీటీడీ విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: చైర్మన్ బీఆర్ నాయుడు



**తిరుపతి(ప్రశ్న న్యూస్)** విద్యే వ్యక్తి జీవితాన్ని మార్చే శాశ్వత సంపద అని, ప్రతిభ, క్రమశిక్షణ, విలువలతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పిలుపునిచ్చారు. తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో బుధవారం ఘనంగా నిర్వహించిన 'ప్రతిభా పురస్కారం--2026' కార్యక్రమంలో టీటీడీ విద్యాసంస్థల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 147 మంది విద్యార్థులను సన్మానించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీటీడీలో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో ప్రస్తుతం 33 విద్యాసంస్థల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక మౌలిక సదుపాయాలు, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు.విద్యార్థులు కేవలం మార్కుల కోసం కాకుండా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకోవాలని ఆయన సూచించారు. నేటి ప్రతిభావంతులే రేపటి దేశ నిర్మాణ శిల్పులని పేర్కొంటూ, టీటీడీ విద్యాసంస్థలు దేశానికి ఆదర్శంగా నిలిచేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# కలెక్టరేట్ గుమ్మంలో కంపు రాజ్యం..

# ప్రజా సేవలకు ఇదేనా ముఖద్వారం.?

- గుంటూరు కలెక్టర్ కార్యాలయం సులబ్ టాయిలెట్లు దుర్వాసనకు కేంద్రం.. ప్రజలకు నరకయాతన.. అధికారులు చూస్తున్నారా?




**గుంటూరు(ప్రశ్న న్యూస్)** జిల్లాలో అత్యున్నత పరిపాలనా కేంద్రంగా పేరుగాంచిన గుంటూరు కలెక్టర్ కార్యాలయానికి ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు వస్తుంటారు. తమ సమస్యలకు పరిష్కారం కోసం, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు ఇవ్వడానికి, వివిధ ప్రభుత్వ శాఖల పనుల కోసం, సంక్షేమ పథకాల దరఖాస్తుల కోసం, ధ్రువపత్రాల కోసం జిల్లాలోని నలుమూలల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. కానీ ప్రజలకు కనీస మౌలిక సౌకర్యం అయిన శుభ్రమైన మరుగుదొడ్డి కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సులబ్ టాయిలెట్లు ప్రస్తుతం దుర్వాసనకు నిలయంగా మారాయి. బయట నుంచే దుర్గంధం ముక్కు పగిలేలా వస్తుండటంతో ఆ ప్రాంతం గుండా నడవాలంటేనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లలోకి వెళ్లే పరిస్థితి లేక చాలామంది వెనుదిరుగుతున్నారు.

### నీళ్లు లేవు... శుభ్రత లేదు... నిర్వహణ జాడలేదు

టాయిలెట్లలో తాగునీరు కాదు, కనీసం ఫ్లషింగ్‌కు అవసరమైన నీరు కూడా అందుబాటులో లేదని ప్రజలు చెబుతున్నారు. రోజువారీ శుభ్రత, క్రిమిసంహారక మందుల పిచికారీ, నిర్వహణ వంటి చర్యలు కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా టాయిలెట్లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి.సులబ్ టాయిలెట్లు ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుతం అవి ప్రజలు దూరంగా ఉండే పరిస్థితికి చేరుకోవడం బాధాకరం.

### పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజల పరిస్థితి మరింత దారుణం

ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి వృద్ధులు, మహిళలు, వికలాంగులు, రైతులు, కార్మికులు వస్తుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, కొన్నిసార్లు సాయంత్రం వరకు తమ వంతు కోసం వేచి ఉండాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో మరుగుదొడ్లు ఉపయోగించుకునే పరిస్థితి లేకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.మహిళలకు ఈ సమస్య మరింత తీవ్రమైంది. చిన్నారులతో వచ్చే తల్లులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

### కలెక్టరేట్ ప్రతిష్ఠకు మచ్చ

జిల్లా పరిపాలనా కేంద్రం అంటే పరిశుభ్రత, క్రమశిక్షణ, ప్రజా సేవలకు ప్రతీకగా ఉండాలి. కానీ కలెక్టరేట్ ఆవరణలోనే ఇలాంటి పరిస్థితులు కనిపించడం ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

"స్వచ్ఛ భారత్", "పరిశుభ్రతే సేవ" వంటి కార్యక్రమాలను ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ, వాటి అమలు కలెక్టరేట్ ఆవరణలోనే కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ఆరోగ్యానికి ముప్పు

దుర్వాసన, అపరిశుభ్రత వల్ల ఈగలు, దోమలు, బ్యాక్టీరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగితే అంటువ్యాధులు వ్యాపించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని హెచ్చరిస్తున్నారు.

### తక్షణ చర్యలు అవసరం

ప్రజలకు ఇబ్బందులు తొలగించాలంటే వెంటనే ఈ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.సులబ్ టాయిలెట్లను పూర్తిగా శుభ్రపరచడం.నిరంతర నీటి సరఫరా కల్పించడం.రోజుకు పలుమార్లు శుభ్రత నిర్వహించడం. క్రిమిసంహారక మందులతో శానిటైజేషన్ చేయడం.మహిళలు, వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం.నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించడం.ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ లేదా నిర్వహణ బాధ్యుల వివరాలు ప్రదర్శించడం. ప్రజా సేవలకు వచ్చే వారికి గౌరవం ఇవ్వాలి కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి వ్యక్తి ఏదో ఒక సమస్యతో వస్తాడు.

అలాంటి ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. మరుగుదొడ్డి వంటి ప్రాథమిక సౌకర్యం కూడా సక్రమంగా లేకపోతే ప్రజలకు ప్రభుత్వం పట్ల ప్రతికూల అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంది. గుంటూరు కలెక్టరేట్ సులబ్ టాయిలెట్ల దుస్థితి కేవలం పరిశుభ్రత సమస్య మాత్రమే కాదు... ప్రజా పరిపాలనలో ప్రాథమిక సౌకర్యాల నిర్వహణపై నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న అంశం. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి టాయిలెట్లను శుభ్రపరచడం, నిర్వహణను క్రమబద్ధీకరించడం, ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటేనే కలెక్టరేట్‌కు వచ్చే వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు ఉపశమనం పొందగలరు. ప్రజా సేవలు అందించే కేంద్రం ప్రజలకు అసౌకర్యానికి కాదు, విశ్వాసానికి నిలయంగా మారాల్సిన సమయం ఆసన్నమైంది.

## గానకోకిల గళం చిరంజీవి...

## 'వందేమాతరం' స్ఫూర్తి శాశ్వతి

- ఎస్. జానకి స్మృత్యంజలి, 'వందేమాతరం' 150 ఏళ్ల వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్
- "జానకి పాటలు యుగయుగాలూ మారుమోగుతాయి... వందేమాతరం దేశభక్తికి శాశ్వత ప్రతీక"



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** సంగీతానికి సరిహద్దులు ఉండవని, గానానికి మరణం ఉండదని మరోసారి చాటి చెబుతూ విజయవాడలో గానకోకిల ఎస్. జానకి స్మృత్యంజలి కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. అదే వేదికపై భారత స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరి పోసిన 'వందేమాతరం' గీతం ఆలపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక వేడుక దేశభక్తి భావాన్ని నింపింది.దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి, భాషా సాంస్కృతిక శాఖ, కేంద్ర సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మంత్రి తొలుత గానకోకిల ఎస్. జానకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభికులతో కలిసి 'వందేమాతరం' గీతాన్ని ఆలపించి దేశభక్తి భావాన్ని చాటిచెప్పారు.

## సీతమ్మసాగర్‌కు గ్రీన్ సిగ్నల్ కోసం ప్రభుత్వ వేగం

- పర్యావరణ అనుమతులపై కేంద్రంతో నిరంతర సంప్రదింపులు ం
- సీతారామ ప్రాజెక్టు పనుల వేగవంతానికి కార్యాచరణ
- మంత్రి ఉత్తమ్‌తో కీలక సమావేశంలో పలు అంశాలు ప్రస్తావించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్) వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సమావేశమైన ఆయన, సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.రేపు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించనున్న నేపథ్యంలో, అక్కడి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పర్యావరణ, అటవీ శాఖలకు సంబంధించిన న్యాయపరమైన అంశాల కారణంగా 2023 మార్చి నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని గుర్తు చేసిన ఆయన, ఆ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వెల్లడించారు.మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సమన్వయం చేసుకుంటూ కేంద్ర మంత్రులు, సంబంధిత శాఖలు, అధికారులతో నిరంతర చర్చలు కొనసాగించి పర్యావరణ అనుమతులు త్వరగా పొందేందుకు చర్యలు తీసుకుంటామని తుమ్మల స్పష్టం చేశారు. అనుమతులు లభించిన వెంటనే ప్రాజెక్టు పనులు పునఃప్రారంభమై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష

## నిర్వహించిన ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస(ప్రశ్న న్యూస్)** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో బుధవారం నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో భాగంగా బుధవారం పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి, రెండో బుధవారాల్లో యూనిట్, మండల స్థాయిలో నిర్వహించిన సమావేశాల్లో ప్రజల నుంచి వచ్చిన వినతులు, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రతిపాదనలు, వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అంశాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు చేసిన సూచనలను నియోజకవర్గ స్థాయి సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు అత్యవసరంగా పరిష్కారం అవసరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులకు, పార్టీ నాయకులకు సూచించారు. సమస్యలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా, వాటి పరిష్కారం జరిగే వరకు నిరంతరం పర్యవేక్షించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలనను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాలు, వార్డులు, మండలాల స్థాయిలో ప్రజల అభిప్రాయాలను సేకరించి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పారదర్శక పరిపాలనకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలపై స్పందించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని ఆమె వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.సమావేశంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బాల్కనీపైనుంచి కింద పడ్డ తల్లీకూతురు

బాల్కనీ పైనుంచి కిందపడి తల్లీకూతురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గుజరాత్‌లో చోటుచేసుకుంది. సూరత్ లింబాయత్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇంటి బాల్కనీకి రైలింగ్ లేకపోవడంతో తల్లీకూతురు కిందపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కూతురు లేచి స్పృహ కోల్పోయిన తల్లికి సాయం చేయడానికి ప్రయత్నించారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరలవుతున్నాయి.

# బాబోయ్... మతిమరుపు

- చిన్నపాటి విషయాలు గుర్తులేకపోవడమే కారణం
- 45 ఏళ్లు దాటిన వారిలో ఈ వ్యాధి లక్షణాలు అధికం
- రోగం ముదరకముందే మేల్కొంటే ఉత్తమం
- ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే సకాలంలో నయం

"ఒకప్పుడు మతిమరుపు అంటే వయస్సు మీద పడిన వారికి మాత్రమే వచ్చేది. ఇప్పుడు మధ్య వయస్సుల నుంచి యువత వరకూ దీని బారినపడుతున్నారు. వయస్సు మీద పడుతున్నకొద్దీ ఎంతోకొంత మతిమరుపు సహజమే. అయినా తేలికగా కొట్టేయడానికి లేదు. మామూలు మతిమరుపులో ఏదైనా క్లూ ఇస్తే ఆయా విషయాలు గుర్తుకొస్తాయి. అల్జీమర్స్ లో అలాకాదు. పైగా మొత్తం జరిగిన సంఘటనలనూ మరిచిపోతుంటారు. జ్ఞాపకాలను తుడిచేయడంతో పాటు మానసికంగానూ కుంగదీస్తుంది. ప్రవర్తననూ గణనీయంగా మార్చేస్తుంది. అసలు ఈ అల్జీమర్స్ లక్షణాలు ఏంటి ? ఈ వ్యాధి ఉన్న వారు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై డాక్టర్ బి.శ్రీధర్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ మాటల్లోనే"








**డా. బి. శ్రీధర్.. కౌన్సిలింగ్ సైకాలజిస్ట్**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )** మనిషి అంటేనే జ్ఞాపకాల సమాహారం. జ్ఞాపకాల తోడు లేకపోతే జీవితమే మూడునాళ్ళవుతుంది. మన ప్రతి కదలిక, ప్రతి మాట, ప్రతి పని వీటితో ముడిపడిందే. అంతటి కీలకమైన జ్ఞాపకాలను అల్జీమర్స్ మూలంగా తుడిచిపెడుతుంది. అల్జీమర్స్, వృద్ధాప్యంలో దాడిచేసే ఇది కన్నవారిని, కట్టుకున్నవారిని గుర్తుపట్టలేని స్థితికి తీసుకొస్తుంది. తీవ్రమైన మతిమరుపును తెలియజెసే డీమెన్షియా రకాల్లో అల్జీమర్స్ ఒకటి. డీమెన్షియా బాధితుల్లో దాదాపు 60–70 మందిలో కనిపించేది ఇదే. ప్రపంచ వ్యాప్తంగా 50కోట్ల మంది డీమెన్షియాతో బాధపడుతుండగా, వీరిలో 7 నుంచి 8శాతం మంది మనదేశానికి చెందినవారు. వీరి సంఖ్య 2030 నాటికి మరింతగా చేరకోవచ్చని అంచనా. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో నిజంగా ఇది కలవరం కలిగించే విషయమే. ఎందుకంటే 65 ఏళ్లు పైబడినవారిలోనే అల్జీమర్స్ ఎక్కువ. ఇది శారీరకంగా కన్నా మానసికంగా, ప్రవర్తన పరంగానే ఎక్కువ ఇబ్బందులు సృష్టిస్తుంది. ఇది జబ్బుతో బాధపడేవారికే కాదు, కుటుంబానికి కనిపెట్టుకునే వారికి చిక్కులు తెచ్చిపెడతాయి. అందువల్ల వీటి గురించి తెలుసుకోవడమే మంచిది. లేకుంటే ఈ వ్యాధితో బాధపడేవారిని అపార్థం చేసుకోవడానికి దారితీస్తుంది.

### రోజువారీ పనులే మరిచిపోతారు..

వ్యాధిగ్రస్తులు రోజువారీ కార్యకలాపాలు మరిచిపోతారు. స్నానం చేయడం, బ్రష్ చేయడం, తిండి తినడం కూడి మర్చిపోతారు. వస్తువులను ఎక్కడో పెట్టి ఆ విషయాన్ని మర్చిపోయి ఎవరో దొంగిలించినట్లుగా అనుమానించడం, చెప్పిన విష్యాన్నే పదేపదే చెప్పటం, మనుషుల పేర్లు మర్చిపోవడం, వాటిని ఏ విధంగా వినియోగించాలో, ఎందు నిమిత్తం వినియోగించాలి అనే విషయాలను మర్చిపోవడం రోగిలో ప్రధానంగా కనిపిస్తాయి. ఇంటికి తాళాలు వేయడం, కూరలో ఉప్పువేయడం, పాల్లో తోడు వేయడం వంటివి మర్చిపోవడం వ్యాధిగ్రస్తుల్లో అధికంగా కనిపిస్తాయి.

### వ్యాధి లక్షణాలు ఇవే..

వయస్సు పెరిగే కొద్దీ వచ్చే అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు ఒకే చోట కూర్చుని వీడియో గేమ్స్, టీవీలు చూస్తుండడం, నిద్ర లేకపోవడం, అతిగా మద్యం తాగడం, శారీరక, మానసిక వ్యాయామం లేకపోవడం, అధిక కొవ్వు ఉన్న మాంసం తినడం వారికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లు మర్చిపోతారు. పేర్లు మర్చిపోవడంతో పాటు వారిని గుర్తించడం కూడా కష్టమే. ఈ వ్యాధి ఎక్కువగా 50 ఏళ్లు దాటిన వారిలో వస్తుంది, నేడు 35 ఏళ్లు వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.

### నివారణ చర్యలు ఇవే..

మతిమరుపును నివారించేందుకు ప్రశాంతమైన మెడిటేషన్, ప్రాణాయామం, పుస్తక పఠనం, రాయడం, బొమ్మలు గీయటం, ఇతర భాషలు నేర్చుకోవడం చేస్తుండాలి. కూరగాయలు, తాజా ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తినాలి. బి12, డి విటమిన్, బి6 వంటి విటమిన్లలోపం తలెత్తకుండా చూసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం చాలా ముఖ్యం.

నలుగురితో కలిసిడిగా ఉండటం, వీలైనప్పుడల్లా బంధువులను, స్నేహితులను కలవటం మంచిది. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం చేయాలి. రోజువారీ వ్యాయామం చేయాలి, కంటి నిండా నిద్రపోవాలి. బ్రెయిన్ ట్యూమర్లు, స్ట్రోక్ కారణంగా అల్జీమర్స్ వస్తుంది. ఈ రోగాలు రాకుండా జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.

### ప్రజల్లో అవగాహన పెరగాలి..

**డాక్టర్ బి.శ్రీధర్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్**

మతిమరుపు వ్యాధి నివారణపై ప్రజల్లో గ్రామస్థాయి నుంచి అవగాహన పెరగాలి. ప్రతి మనిషిలో చిన్నపాటి మతిమరుపు ఉండటం సహజం. కానీ అది ముదరకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ, యువతతో పాటు, 60 ఏళ్లు దాటిన వారు నిత్యం వాకింగ్, వ్యాయామం చేయడంతో పాటు, తాజా ఆకుకూరలు తినాలి. కంటినిండా నిద్రపోవాలి. స్నేహితులు, కుటుంబసభ్యులతో మాట్లాడుతుండాలి. ఇతర భాషలను నేర్చుకోవడంతో పాటు ప్రతి రోజు 100 నుంచి 1 వరకు రివర్స్ చదువుకోవాలి.

## మతిమరుపు కు కారణాలు..

వయస్సు పెరగడం ఒత్తిడి (స్ట్రెస్), ఆందోళన, డిప్రెషన్ సరైన నిద్ర లేకపోవడం విటమిన్ డి12 లోపం థైరాయిడ్ సమస్యలు మధుమేహం, అధిక రక్తపోటు
మద్యం, మత్తు పదార్థాల వినియోగం కొన్ని మందుల దుష్ప్రభావాలు అల్జీమర్స్

### ఏమి తినాలి.?

జ్ఞాపకశక్తి మెరుగుపడేందుకు ఆకుకూరలు బాదం, వాల్‌నట్స్ చేపలు (ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్లు) తాజా పండ్లు పాలు, పెరుగు గుడ్లు తగినంత నీరు

### ఏమి తినకూడదు.?

జంక్ ఫుడ్ ఎక్కువ నూనె, వేయించిన ఆహారం అధిక చక్కెర ఉన్న పదార్థాలు శీతల పానీయాలు అధిక మద్యం పొగాకు ఉత్పత్తులు

### జ్ఞాపకశక్తి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రతిరోజూ 7--8 గంటలు నిద్రపోవాలి. రోజుకు కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయాలి. పుస్తకాలు చదవడం, పజిల్స్, చదరంగం వంటి మెదడుకు వ్యాయామం చేసే పనులు చేయాలి. యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలి. మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి.

### ఎప్పుడు వెంటనే డాక్టర్‌ను కలవాలి?

ఈ లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి: ఇంటి దారి కూడా మర్చిపోవడం కుటుంబ సభ్యులను గుర్తుపట్టలేకపోవడం మాటలు సరిగా రాకపోవడం చేతులు, కాళ్లు బలహీనంగా మారడం అకస్మాత్తుగా తీవ్రమైన మతిమరుపు రావడం

# మద్యం సిండికేట్ మాఫియా జోరు

- క్వార్టర్‌కు 50 రూపాయల అదనపు భారం.?
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

**ములుగు(ప్రశ్న న్యూస్)** ములుగు జిల్లా వెంకటపురం, వాజేడు మండలాల్లో మద్యం సిండికేట్ రాజ్యమేలుతోంది. రిటైల్ వైన్స్ షాపుల యజమానులు కుమ్మక్కై సిండికేట్‌గా ఏర్పడి, బెల్ట్ షాపులకు అధిక ధరలకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఫలితంగా సామాన్య మద్యం ప్రియుల జేబులకు చిల్లు పడుతోంది. ఈ వ్యవహారంపై సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




### ఆడిందే ఆట.. పాడిందే పాట..

ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ములుగు జిల్లా సీనియర్ నాయకులు వావిలాల స్వామిమాదిగ మాట్లాడుతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వాజేడు వెంకటాపురం కన్నాయి గూడెం తాడ్వాయి మండలం లోని
వైన్స్ షాపుల యజమానులు అందరూ కుమ్మక్కై సిండికేట్‌గా మారారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే క్వార్టర్‌కు కనీసం 20 నుంచి 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. వైన్స్‌కు వచ్చే మద్యం నిల్వలో ఎక్కువ భాగం నేరుగా బెల్ట్ షాపులకు తరలిపోతోంది. దీంతో బెల్ట్ షాపుల్లో మద్యం కోసం ప్రజలు అధిక ధర చెల్లించక తప్పడం లేదు అని ఆయన ఆరోపించారు.రెండు మండలాల పరిధిలో 200కు పైగా బెల్ట్ షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయని, వాటికి వెంకటపురం, వాజేడు నుంచే మద్యం సరఫరా అవుతోందని వావిలాల స్వామిమాదిగ తెలిపారు.

### మహిళల జీవితాలు అల్లకల్లోలం..

మద్యం అధిక ధరలకు అమ్మకాలు, రాత్రివేళ బెల్ట్ షాపుల రద్దీతో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని మహిళా సంఘాల నాయకురాళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంకటపురం మాదిగ మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ రాత్రి 8 గంటల తర్వాత మహిళలు ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. తాగుబోతుల అల్లర్లు, బూతు మాటలు, హింసాత్మక ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మా పిల్లల భద్రత ప్రశ్నార్థకంగా మారింది అని అన్నారు.వాజేడు ఆదివాసి మహిళా సంఘం మహిళలు మాట్లాడుతూ కుటుంబాల్లో గొడవలు పెరిగాయి. భర్తలు కూలీ డబ్బులన్నీ మద్యానికి తగలేస్తున్నారు. ఇంట్లో పిల్లలకు కనీసం కడుపు నిండా అన్నం కూడా లేని పరిస్థితి. అధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం" అని హెచ్చరించారు.

### మామూళ్లతోనే మాఫియాకు వంత.?

సిండికేట్ వ్యవహారం అందరికీ తెలిసినా ఎక్సైజ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్న ప్రజల్లో ఉంది. "మామూళ్లు అందుతున్నందునే అధికారులు మద్యం వ్యాపారులకు వంత పాడుతున్నారని" స్థానికులు ఆరోపిస్తున్నారు. రిటైల్ వైన్స్ షాపుల్లో స్టాక్ సరిగ్గా లేకున్నా, బెల్ట్ షాపుల్లో మాత్రం ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ దొరుకుతోంది. దీనివెనుక భారీ ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రభుత్వ ఆదాయానికే గండి..

సిండికేట్ కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా నష్టపోతోంది. వైన్స్ షాపుల యజమానులు "అంతా మేమే చూసుకుంటాం" అంటూ రెచ్చిపోతున్నారని నరసింహమూర్తి విమర్శించారు.పేద ఆదివాసి కుటుంబాలు అప్పులు చేసి మద్యం కొంటున్నాయి. ఇది సామాజిక సమస్యగా మారుతోంది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సిండికేట్‌ను కూల్చి, బెల్ట్ షాపులను మూసివేయాలి. లేకుంటే ఆదివాసి సంఘం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం" అని ఆయన హెచ్చరించారు.




### వెంటనే చర్యలు తీసుకోండి..

వెంకటపురం, వాజేడు పరిధిలోని అక్రమ బెల్ట్ షాపులపై వెంటనే దాడులు చేసి తొలగించాలని సిండికేట్‌లో ఉన్న వైన్స్ యజమానుల లైసెన్సుల రద్దు చేయాలి.బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ అధికారులపై ఏసీబీ, స్టేట్ విజిలెన్స్ అధికారులచే విచారణ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

# నేరాలకు అడ్డాగా మారుతున్న ఇళ్లు

- ఇంటి ఓనర్లకు హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగరంలోని ఇంటి యజమానులకు పోలీసు యంత్రాంగం కీలక హెచ్చరికలు జారీ చేసింది. నివాసాలను అద్దెకు ఇచ్చేటప్పుడు ఆ వివరాలను తప్పనిసరిగా పోలీసులకు సమర్పించాలని, అద్దెదారుల పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని, అవసరమైతే ఆస్తులను సైతం సీజ్ చేస్తామని హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసులు హెచ్చరించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రెసిడెన్షియల్ కాలనీలు, అపార్ట్‌మెంట్లు, లాడ్జీలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అద్దె ఇళ్లే కేంద్రంగా డ్రగ్స్ సరఫరా, జూదం, వ్యభిచారం, సైబర్ మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు, అనుమానితులు నివాస ప్రాంతాల్లో తలదాచుకోకుండా నిరోధించేందుకే ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.ఇంటి యజమానుల సౌలభ్యం కోసం 'హాక్ ఐ' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ యాప్ ద్వారా అద్దెదారుల వ్యక్తిగత వివరాలు, గుర్తింపు కార్డులు, ఫొటోలను నేరుగా అప్‌లోడ్ చేయవచ్చు. యాప్ వినియోగించని వారు స్థానిక పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు ఫారాలు తీసుకుని, అవసరమైన ధ్రువపత్రాలతో సహా సమర్పించాలని సూచించారు. కేవలం బ్రోకర్లు చెప్పే మాటలను నమ్మవద్దని, కమీషన్ల కోసం వారు కొన్నిసార్లు తప్పుడు సమాచారం ఇచ్చే అవకాశం ఉంటుందని యజమానులను పోలీసులు హెచ్చరించారు. భద్రత దృష్ట్యా ఇళ్ల ప్రవేశ ద్వారాలు, కారిడార్లు, మెట్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమమని సలహా ఇచ్చారు. నేరాలను అరికట్టి, సమాజ భద్రతను మెరుగుపరిచేందుకు యజమానులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

# హుస్సేన్ సాగర్ సమీపంలో భారీ ప్రాజెక్టు

- ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు హైకోర్టులో ఊరట



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని మౌలిక సదుపాయాల రంగంలో కీలకమైన ఓ ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమైన పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని నిర్మాణాలకు సంబంధించి ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సదరు నిర్మాణ సంస్థపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశించింది. సోమాజిగూడ నెక్లెస్ రోడ్డు సమీపంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ఒక భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టింది. అయితే, ఈ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ జీహెచ్ఎంసీ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ సదరు సంస్థ హైకోర్టును ఆశ్రయించింది.ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సదరు నిర్మాణ ప్రాజెక్టు విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. భవన నిర్మాణంపై ఎటువంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. అలాగే, ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది. జీహెచ్ఎంసీ చట్టం సెక్షన్ 450 కింద ప్రాజెక్టుకు మంజూరు చేసిన భవన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ జూలై 7న జీహెచ్ఎంసీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ చేపట్టిన ధర్మాసనం సదరు సంస్థకు అనుకూలంగా తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది.

# బంజారాహిల్స్ తాజ్ హోటల్ కూల్చివేత!

- భారీ టవర్ నిర్మాణానికి సన్నాహాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగర చిహ్నంగా నిలిచిన బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా హోటల్ ఇక చరిత్రలో కలిసిపోనుంది. నగర ఆతిథ్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఈ హోటల్ కూల్చివేత పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఈ స్థలంలో సుమారు 40 అంతస్తుల భారీ నివాస సముదాయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బంజారా లేక్‌ను ఆనుకుని ఉన్న 3.4 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఆస్తిని అరబిందో రియాల్టీ సంస్థ రూ.315 కోట్లకు దక్కించుకుంది. 2023లోనే హోటల్ కార్యకలాపాలు నిలిచిపోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులో కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. మొదటగా తలుపులు, కిటికీలు, ఇతర ఫర్నిచర్‌ను తొలగించిన యంత్రాంగం, ప్రస్తుతం ప్రధాన భవనాన్ని నేలమట్టం చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో నాలుగు నెలల సమయం పట్టవచ్చని అంచనా.1979లో ఏర్పాటైన తాజ్ బంజారా, నగరంలోని తొలి విలాసవంతమైన హోటళ్లలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. సినీ ప్రముఖులకు, పారిశ్రామికవేత్తలకు ఇది దశాబ్దాల పాటు ఇష్టమైన వేదికగా నిలిచింది. 1986 వరకు ఐటీసీ గ్రూప్ నిర్వహణలో ఉండగా, ఆ తర్వాత సుమారు నాలుగు దశాబ్దాల పాటు తాజ్ జీవీకే హోటల్స్ దీన్ని విజయవంతంగా నడిపించింది. అయితే, ఆస్తిపన్ను బకాయిల కారణంగా జీహెచ్ఎంసీ అధికారులు ఈ హోటల్‌ను తాత్కాలికంగా సీల్ చేశారు. సుమారు రూ.1.43 కోట్ల బకాయిలతో పాటు ఇతర కారణాల వల్ల ఇది మూసివేతకు దారితీసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588